# మిసిమి

మాస పత్రిక

డిశంబర్- 2002



వెల రూ. 8/-



**ప్రయాణం**

**చిత్రకారుడు : రాజర్షి బిష్వా, కలకత్తా**

# మిసిమి

**"All that we are is the product of what we have thought" is "We are what we think." - Dammapada.**

సంపుటి 13 డిశంబరు 2002 సంచిక 12

వ్యవస్థాపక సంపాదకుడు : **డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి**

## విషయ సూచిక

ధిక్కార స్వరం మూగపోయింది - కె. జితేంద్రబాబు

కామెడీ నాటకాల ద్వారా మానవత్వానికి పట్టం కట్టిన బెన్‌వాంటె - సి. యల్. యల్. జయప్రద

రాహుల్ సాంకృత్యాయన్ ఘుమక్కడ్ శాస్త్ర (1946-48) - డా॥ యమ్. ఆదినారాయణ

స్వగతం నుండి స్వగతానికి - డా॥ యు. ఏ. నరసింహమూర్తి

మూఢ నమ్మకాలు - సి. వి. సర్వేశ్వర శర్మ

సాహిత్య ఆకాశంలో ఉరుములు - మెరుపులు - మువ్వల సుబ్బరామయ్య

విడిప్రతి రూ. 8/- వార్షిక చందా రూ. 100/- విదేశీయులకు $ 20

ముఖచిత్రం : **కాళోజి**

చిత్రకారుడు : **రమావత్ శ్రీనివాస్ నాయక్**

Printed & Published by BAPANNA ALAPATI at Kala Jyothi Process Ltd.,
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyd - 20. Ph. 7645536
E-mail : misimieditor@rediffmail.com

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

# Present tense
# Five Books That Made India

**- Jerry Pinto**

A COUPLE of friends, Independence Day. Desultory conversation about the literature of a nation.

And this is what came of it.

*My Experiments with Truth by Mohandas Karamchand Gandhi.*

Gandhiji was interested in everything and everybody. The experiments he conducted in the laboratory of his self had repercussions for India simply because the personal, the private and the public were not differentiated as in the Western tradition, However, this multilayered and badly translated book - Suketu Mehta, the new enfant terrible of Indian writing in America is working on a new translation - is often reduced to a parody of itself, the revelations about sleeping with nude nubile women as a test of commitment to celibacy overshadowing the Mahatma's journey towards who he actually was.

That journey ended in the acquisition of a new identity, as Indian, as revolutionary, as Hindu. And that identity, for better or worse, would impose itself on the nation state at its formative stages.

*The Discovery of India* by Jawaharlal Nehru. This is the voice of urbane India, celebrating itself.

Yes, Max Muller set the stage for this. Yes, Ananda Coomaraswamy helped. But no single voice has articulated the history of India, has established the canon of its art and architecture as surely as Nehru's. Often this is the voice of the Cambridge don, the polished periods flowing smoothly across centuries of Indian history.

Often this is the voice of the Indian elite, speaking for itself, announcing its own arrival with a self-effacing fanfare. Often this is the voice of a father speaking to his daughter, educating her mind while starving her heart.

And since father and daughter were the architects of India after the death of Gandhi and the sidelining of Sardar Vallabhbhai Patel, this is the book to read.

*The Selected Works* of MN Roy.

Roy was one of those figures that we never know whether to celebrate or revile. Exiled from India due to his involvement with the Bengali militants, he met Karl Marx, founded the Mexican Communist Party, opposed Lenin on the National and Colonial Question, joined the Indian National Congress and was expelled from it soon enough. However, his influence was important enough to last long after his death.

The radical, secular and humanistic philosophy he propounded along with his Marxism makes you wish that an accident hadn't terminated his life when it did.

*The Selected Works* is a teaser with its extracts from *Memoirs of a Cat* (a critique of Hinduism) and *Nationalism; An Antiquated Cult* (which proves that post - nationalism is not necessarily as late a 20th Century phenomenon).

*May It Please Your Honour* by Nathuram Godse.

The great mistake was banning it. Because of the ban, this rather boring work by the man who turned the Mahatma into a martyr of Hindu fanaticism, has turned into a cult classic of sorts. Try reading it, with its boring denials. No, I did not meet Savarkar, No, I was not at that Hotel. No, I didn't. No, No, No.

The answer to a chargesheet would naturally contain denials. However reading this one makes it seem like Nathuram Godse was not a phenomenon of his times but a maverick working on his own. His critique of Gandhi's politics makes you feel a sense of deja vu. Then the penny drops. It's the Hindu right speaking in the ' 40s.

*All About H Hatterr* by GV Desani.

GV Desani wrote this one in 1949. For its time, it was a revolutionary work, celebrating an Indian English without condescending to it. It has often been called the forebear of the magical realists but it actually has nothing to do with it. It has been called the Indian *Of Human Bondage* but Hatter's search for wisdom from the seven sages has many other layers and levels, ranging from a subtle defence of Indian metaphysics, a great comedy of intellectual errors to a complex interrogation of modernism. Rushdie called it the first great stroke of the decolonising pen and so it was.

*(Courtesy by: Statemen)*

# ధిక్కార స్వరం మూగపోయింది

– కె. జితేంద్రబాబు

> మానుష స్ఫూర్తికి పడిన మచ్చలను క్షాళనం చేయడంలో మానసికాలైనా ఇతరాలైన బానిసతనపు శృంఖలాలనుత్తరించడంలో అవిశ్రాంతంగా పోరి గెలిచిన, కీర్తికండూతి సోకని దుర్దమ మూర్తిమత్వం కాళోజీ కనుమూసాడు మన కనులు తెరచి
>
> – సంపాదకుడు

అయం నిజః పరోవేతి గణనా లఘుచేతసామ్
ఉదార చరితానాం తు వసుధైవ కుటుంబకమ్

ఇతను నావాడు, ఇతను పరుడు అనే భావం అల్ప బుద్ధులకు ఉంటుంది. ఉదార చరితులకు వసుధ అంతా తన కుటుంబమే. వసుధ అంతా తన కుటుంబంగా భావించిన కాళోజి జీవితం అంతా సమాజ సేవకే అంకితం చేసాడు. తొమ్మిది దశాబ్దాల తెలంగాణా జీవితానికి వారధిగా కాళోజి నిలచాడు. ఒక్క మాటలో చెప్పాలంటే కాళోజి జీవితం తెలంగాణా జీవితం. తెలంగాణా సంస్కృతికి చిహ్నం కాళోజి. ఆయనది సంపూర్ణ సార్థక జీవితం.

కాళోజి నారాయణరావు పూర్తి పేరు ''రఘువీర్‌నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాసరావు రామ్‌రాజా కాళోజీ.'' కాళోజి 9 సెప్టెంబర్ 1914న బీజాపూర్ జిల్లాలోని రట్టహాళి గ్రామంలో కాళోజి రంగారావు రమాబాయిలకు జన్మించాడు. ఆయన పూర్వీకులు మహారాష్ట్రను పాలించిన పేష్వాల వద్ద ఆర్థిక గణాంక శాఖలో ఉద్యోగులుగా ఉండేవారు. కాళోజి తల్లి మాతృభాష కన్నడం. ఆమె ఇంట్లో కన్నడ, మరాఠి భాషలు మాట్లాడేది. తండ్రి మాతృ భాష మరాఠి అయినప్పటికీ మరాఠి భాషరాకపోవుటవలన ఇంట్లో ఉర్దూ, హిందీ భాషల్లో ప్రసంగించేవాడు. చిన్నతనంలోనే కాళోజికి కన్నడ, మరాఠి, హిందీ, ఉర్దూ భాషలు తల్లి దండ్రుల వద్ద, బయట వారితో సంభాషిస్తూ తెలుగు భాషను నేర్చుకున్నాడు. కాళోజికి రెండవ యేట వారి కుటుంబం వరంగల్ జిల్లాలోని మడికొండకు వచ్చి స్థిరపడ్డారు. ఆనాడు మడికొండలో నాల్గవ తరగతి వరకు మాత్రమే ఉండేది. అప్పటికే మడికొండలో పెద్ద శివరాజు ''ప్రతాపరుద్ర ఆంధ్రభాషానిలయం'' పేర గ్రంథాలయం నడుపుతు పురాణాలు చెప్పేవారు. కాళోజి అన్న కాళోజి రామేశ్వరరావు మిడిల్‌స్కూల్ పాసయి లా చదువుకు హైద్రాబాద్ వస్తే అన్నతో పాటు కాళోజి కూడా హైద్రాబాద్ వచ్చి రెండవ ఫారంలో చేరినాడు. 1938 లో కాళోజి అన్న ఉర్దూ మీడియంలో వకాలత్ పాసయి ప్రాక్టీసుకు వరంగల్ వస్తే కాళోజి కూడా వరంగల్ వచ్చి కాలేజియేట్ హైస్కూల్ లో చేరినాడు. కాంగ్రెసు ఉద్యమంలో పాల్గొన్నాడు. వార్ధాలో కాంగ్రెసు మీటింగ్ కు 1940లో వెళ్ళినాడు. అదే సంవత్సరం వేలూరు మాణిక్యరావుగారి కుమార్తె రుక్మిణి బాయిని వివాహం చేసుకున్నాడు. ఆమెను అందరూ యాదక్క అని పిలుస్తారు. అదే సంవత్సరం వకాలత్ II గ్రూపు పాసై వకీలు అయినాడు. ప్రాక్టీసులో ఇమడ లేదు. నిజాం రాజ్యంలో అకృత్యాలను నిరసించాడు. జిల్లా బహిష్కరణకు గురి అయినాడు. గోల్కొండ పత్రికలో నిజాం ప్రధానికి బహిరంగ లేఖ పేరున ....

---

కె. జితేంద్రబాబు, న్యాయవాది, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, హైదరాబాద్.

''కోటగోడల మధ్య ఖూని జరిగినచోట
గుండాల గుర్తులు గోచరించినవా?''
జెండా యెత్తిన యంతజంబియాలు దూసిన
శిక్షతప్పదటంచు చెప్పవచ్చితివా?

అంటూ కవితాప్రశ్నలు సంధించాడు. ఆ నాటినించి కాళోజి మాటల్లో చెప్పాలంటే ''నా జీవితంలో నేను వేరే పనిపాటలు ఏమీ పెట్టుకోలేదు గాబట్టి ఫలాని చోటుకి ఫలాని రోజుకి పోవలే అనే నియమం ఏమీ లేదు. నాతోటి కలిసిన వాండ్లతో గంటో అర్ధో మాట్టాడేవరకు వాండ్లతో ఆత్మీయత ఏర్పడ్డం, వాండ్లు ఇంకో దిక్కు పోదామంటే వాండ్ల వెంబడి పోవడం. అసలు ఇంటి నుంచి బయల్దేరి పోదామనుకున్న ప్రదేశానికి పోకుండానే, మరో దిక్కు పోవడం చాలసార్లు తటస్థించింది. నేను ఏ రోజున ఎక్కడ వుంటానో ఎవరికీ తెల్వదు అన్నమాట'' ఇలా తిరుగుతూ తన జీవితాన్ని గూర్చి......

''అతిధివోలె వుండి వుండి
అవని విడిచి వెళ్ళుతాను
పల్లెపట్టణంబులనక
పల్లేరై తిరిగినాను
మురికినీటి నడుమవున్న
ఇరుకులలో ఇరికినాను
కూటి పేద తన కబళము
నోటకీయ గుడిచినాను''

అని కాళోజి రాసిన కవిత చాలా ప్రసిద్ధి పొందింది. చిలుకూరులో జరిగిన ఆంధ్రమహా సభలో 1943వ సం॥లో 'ప్రజాకవి' బిరుదు ప్రదానం చేసారు. ఆ నాటికే కాళోజి వైయక్తిక జీవితానికి సమాంతరంగా కవిత్వాన్ని రచిస్తూ వచ్చాడు. సమకాలీన రాజకీయ ఉద్యమాల నుండి విడదీసి చూడలేము. కాళోజి 1960లో సంపన్న దేశాలు ఇచ్చే సహాయాన్ని దృష్టిలో వుంచుకొని ఎంతో వ్యంగ్యంగా రచించిన కవిత ఈనాటికీ సరిపోతుంది.

బడుగు జాతి ఏడిస్తే
బలిసినోడు ఎయిడ్ ఇస్తే
బత్యాలకు సరిపుచ్చక
బ్రతుకు బేరమెన్నాళ్ళు ?

కార్రు ఎద్దు లేదనుచు
కుర్రో మొర్రో అను రైతును
మర నాగలి వివరాలతో
మాయజేయుటెన్నాళ్ళు ?

విత్తనాల గింజలతో
విందులారగించి త్రేన్చి
వ్యవసాయము సాగదనుచు
వగల మాట లెన్నాళ్ళూ ?

బావిపూడ్కె తీయలేక
బావురుమను కాపన్నను
పవర్ పంపు తీగలతో
భంగపరచుటెన్నాళ్ళు ?

1945వ సంవత్సరంలో కాళోజి ప్రొ॥ లిన్- యూ- టాంగ్ వ్రాసిన పుస్తకం The Importance of livingను చదివాడు. దానిలో చెప్పిన.... "a man with a sense of detachment (takuan) toward life based on a sense of wise disenchantment. From this detachment comes high-mindedness (Kuanghuai), a high-mindedness which enables are to go through life with tolerant irony and escape the temptations of fame and wealth and achievement, and eventually makes him take what comes. And from this detachment arise also his sense of freedom, his love of vagabondage and his pride and nonchalance. It is only with this sense" of freedom and non chalance that one eventually arrives at the keen and intense joy of living" ఈ వాక్యాల్లో చెప్పిన తత్త్వాన్ని కాళోజి జీర్ణించు కొన్నాడు అందువల్ల అతని జీవితం అలానే గడిచిందనిపిస్తుంది. ఈ పుస్తక ప్రేరణతోనే కాళోజి .....

''నర్తకుని నాట్యాలుగాయకుని గానాలు
వాదిత్రుని వాద్యాలుశిల్పకుని శిల్పాలు
చిత్రకుని చిత్రాలు అంగనల అందాలు
కందర్పు కయ్యాలు కవిరాజు కావ్యాలు
కర్షకా! నీకట్టు కదలినన్నాళ్ళే.
దాంభికుని ధ్యానాలుఛాందసుని జాప్యాలు
తాత్త్వికుని తత్త్వాలుమాంత్రికుని మంత్రాలు
గురువుల గోప్యాలుగుడుగుడు గుంచాలు
దేవుళ్ళ తిరునాళ్ళుదివ్యనది తీర్థాలు
కర్షకా! నీకట్టు కదలినన్నాళ్ళే.
ధార్మికుని దానాలు పండితుని భాష్యాలు
వర్తకుని వ్యాజ్యాలు వక్కీళ్ళ వాదాలు
సైనికుని శౌర్యాలు యాంత్రికుని యంత్రాలు
యోధుల యుద్ధాలు రాజుల రాజ్యాలు
కర్షకా! నీకట్టు కదలినన్నాళ్ళే.

అనే ఈ గేయం రాసాడు. ఆధునిక కవితా యుగంలో కాళోజి 'నా గొడవ' (కవితలు1953) స్పష్టమైన సామాజిక దృక్పథాన్ని తెలియజేయడంలో వస్తుపరంగా, అభివ్యక్తి పరంగా, శిల్ప పరంగా, సరళమైంది. లయామయంగా, గతిశీలంగా, లలితంగా, స్పష్టంగా, సూటిగా, భావాత్మక సంవేదన అంతస్స్రూతంగా కాళోజి కవిత సాగింది. దాదాపు ఏడు దశాబ్దాలపాటు సామాజిక సమస్యలకు సమాంతర స్పందనలే కాళోజి 'నా గొడవ'. ప్రశ్నాత్మకమైన, సామరస్యం స్వభావానికి సరిపడని ధిక్కార

స్వరం ఆయన కవిత్వంలో గోచరిస్తుంది. కాళోజికి పార్టీ పాతివ్రత్యం గిట్టదు. రాజ్య హింస, అధికృత హింస నచ్చదు. బహుభాషా సంస్కృతులతో సహజీవనం చేసిన విప్లవ ఋషి. సజీవోద్యమ కవి.

కాళోజి జీవితమే ఉద్యమం. ఉద్యమమే ఆయనకు జీవితం. కాళోజి జీవితమే కవిత్వం. కవిత్వమే కాళోజికి జీవితం. నిబద్ధత, నిమగ్నతలు కాళోజి కవిత్వానికి ప్రాణం. సామాన్య జీవితం గడుపుతూ అసమాన్యుడుగా లోకోత్తర సత్యాలను, సృజనాత్మకమైన పద్ధతిని కవితల్లో అభివ్యక్తపరిచాడు. "We make out of the quarrel with others, rhetoric, but of the quarrel with ourselves, 'poetry'. ఇతర్లతో కలహంవల్ల మనకు వాక్చాతుర్యం వస్తుంది, స్వయంగా మనతోనే కలహం వల్ల కవిత్వం వస్తుందని యేట్సు కవి అంటాడు. కాళోజి విషయంలో ఇతర్లతో కలహం వల్ల కవిత్వం వచ్చింది. స్వయంగా మనతో కలహం వల్ల వాక్చాతుర్యం వచ్చింది. కాళోజి జీవితం యొక్క పవిత్రాశయాల్లో ఒకటి స్వేచ్ఛగా జీవించడం, స్వేచ్ఛగా ఆలోచించడం. కాళోజి నాలాంటి చిన్నవారితో స్నేహం చేసాడు, పెద్దవారితోను చేసాడు. కొన్ని విషయాల్లో అందరితో విభేదించాడు. ఆయన స్నేహశీలం తెలంగాణా అంతా వ్యాపించింది. స్నేహితులను ఎంతగా ప్రేమించాడో అంత నిష్పాక్షికంగా, నిర్భీతిగానూ వారితో విభేదించాడు. వారి కష్టాలకు, సుఖాలకు స్పందించాడు. జీవితాన్ని విచక్షణాత్మకంగా అనుభవించాడు, స్థిత ప్రజ్ఞుడుగా జీవించాడు. 'మిత వాదుల్లో' అతివాదిగా, అతివాదుల్లో మితవాదిగా సంచరించాడు.

అన్యాయాన్నెదిరిస్తే
నా గొడవకు సంతృప్తి
అన్యాయం అంతరిస్తే
నా గొడవకు ముక్తి ప్రాప్తి
అన్యాయాన్నెదిరించినవాడు
నాకు ఆరాధ్యుడు.

అంటూ - ఆంధ్రప్రదేశ్‌లో తీవ్రవాద ఉద్యమాన్ని అభిమానించాడు. రాజ్యహింసను ధిక్కరించాడు. కాళోజి శిష్యుడు పి.వి. నరసింహారావు ప్రధానమంత్రిగా ఉండిన కాలంలో 'పద్మవిభూషణ్' ఇస్తే స్వీకరించాడు. కాకతీయ విశ్వ విద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్‌ను స్వీకరించాడు. అణా కథలు (1941), కాళోజి కథలు (1943), పార్థిక వ్యయము (1946), నా గొడవ (1953), జీవన గీత (1968), తెలంగాణా ఉద్యమ కవితలు (1969/70), కాళోజి కథలు (2000) కాళోజి ప్రచురించారు. ''నా పరాయి తనం పోగొట్టి ఆర్ద్రత చెలిమి చెలమలో చిందునన్నాళ్ళు... నా ఇరుమల చేరి దూరి అడ్డమైన మురికినంతా తన్నేసి జీవన నది జీవనదిగా ప్రవహించు నన్నాళ్ళు నేను బ్రతికే ఉంటా'' నని మిత్రులందరికి చెప్పిన ప్రజాకవి కాళోజి 13 నవంబర్, బుధవారం 2002న నిమ్స్ హాస్పటల్‌లో మరణించారు. కాళోజి; జయప్రకాశ్ నారాయణ మరణించినపుడు ''చావు నీది పుట్టుక నీది బతుకంతా దేశానిది'' అన్నమాటలు కాళోజికి వర్తిస్తాయి. ప్రజాకవి నాకు చిరకాలమిత్రులు, ఆప్తులు కాళోజికి ఇదే నా అశ్రునివాళి.

# కామెడీ నాటకాల ద్వారా మానవత్వానికి పట్టం కట్టిన బెన్‌వాంటె

## (1922వ సం॥ నోబెల్ సాహిత్య బహుమతి పురస్కారోపన్యాసము)

మూలం: కౌంట్ డటొరాటో, స్పానిష్ రాయబారి          అనువాదం: సి. యల్. యల్. జయప్రద

ఈ రోజు నేను పొందుతున్న గొప్ప సంతృప్తి మాటలలో తెలియపరచటం కష్టతరంగా తోస్తుంది. నాముందున్న కార్యానికీ, ఈ సభాసదులు మెప్పు పొందగలదీ, సరితూగ గలదీ బెన్‌వాంటె రచనా ప్రతిభ మాత్రమే. అటువంటి గొప్ప రచయిత మన మధ్య ఇప్పుడు లేకపోవటం గురించి నేను మీ తరుపున, నా తరుపున కూడా విచారిస్తున్నాను. మీరు ఈ పురస్కారాన్నివ్వటం బెన్‌వాంటేనే కాదు, స్పెయిన్‌ని, స్పానిష్ దేశాలన్నిటినీ గౌరవించటం అయింది. ఈ దేశాల ప్రతినిధులు మన మధ్య కన్పించటం నాకు ఆనందదాయకమైన విషయం. మన పరస్పర బంధాలనీ, స్నేహాన్నీ, సహృద్భావాన్నీ పెంపొందించటంలో ఈ పురస్కారం శక్తివంతంగా పని చేస్తుందని ఆశిస్తున్నాను. ముగించే ముందు నాకు మీ దేశం పట్ల ఉన్న గాఢమైన అనురక్తిని, గౌరవ భావాన్నీ వ్యక్తీకరించనివ్వండి.

బహుమతి ప్రదానానికి ముందు ఆచార్య H.G. సోడర్ బోమ్ ఈ పరిచయ వాక్యాలు పలికారు. ''కవితా సుందరి ఈ సంవత్సరం ధగ ధగా మెరిసే నాటక కళ దుస్తులు వేసుకుని లోపేడల్‌గా కాల్డరాన్ మాతృభాషలో, ప్రపంచంలో ఎక్కువ జనాలు మాట్లాడుకునే భాషలో మనను పలకరించటానికి సుదీర తీరాల నుండి వచ్చింది.

నాటక కర్తలు తెర వెనకే ఉండాలనీ, బయట ప్రపంచానికి వారి పాత్రలు తప్ప మరేమీ కన్పించరాదనీ తరచూ వింటుంటాము. బహుమతి గ్రహీతను ఈ సమయంలో అక్షరాలా ఈ సూత్రం పాటించి మన ముందుకు రాకుండా చేసిన పరిస్థితుల గురించి చింతిస్తున్నాము. అయినా సమీప భవిష్యత్తు ఆయనను మనం కలుసుకునే అవకాశం, ఆయన రచనలతో పరిచయ భాగ్యం కలుగచేస్తుందని ఆశిద్దాం.''

### బహుమతి ప్రదానం

స్వీడిష్ అకాడమీ నోబెల్ కమిటీ అధ్యక్షుడు పెర్ హాల్‌స్ట్రామ్

యాసింటొ బెన్‌వాంటె తన ప్రతిభా పాటవాలను ఎక్కువగా నాటకరంగంపై కేంద్రీకరించి, తన వ్యక్తిగత అనుభవాలు నేర్పిన పాఠాలనుండి ఒక నిర్దిష్టమైన మార్గంలో కృషి చేసి తన నైపుణ్యాన్ని వికసింప చేసుకున్నారు. ఈ నిర్దిష్టమైన మార్గం ఈ కళాకారునికి తన సంపూర్ణ వ్యక్తిత్వాన్ని సూటిగా, స్వేచ్ఛగా వ్యక్తీకరించటానికి వాహిక అయింది. మరే ఒక్కరు ఇంత తక్కువ కృషితో గానీ చింతావలోకనంతో గానీ ఆయన సాధించిన సాహిత్య విలువలు సాధించలేకపోయారు.

---

సి.ఎల్.ఎల్. జయప్రద, వాల్తేరు, ఆంధ్రవిశ్వవిద్యాలయంలో, ఆంగ్ల శాఖలో రీడర్‌గా పని చేస్తున్నారు.

ఆయనను ముందుకు నడిపించిన భావాలు కూడా అసాధారణమైన సమతుల్యం గలవి, సంపూర్ణమైనవి. ఆయనకు నాటక కళ, నాటకరంగమంటే అపారమైన ప్రేమే కాదు బాహ్య ప్రపంచం పైన కూడా మమకారం ఉంది. ఈ ప్రపంచంలోని యథార్థాలను నాటకరంగంపైకి తీసుకురావడమే ఆయన ఎంచుకున్న వృత్తి. విమర్శనా రహితంగా జీవితాన్ని ఆయన పైపైన చూసి ఆరాధించలేదు. లోకాన్ని వాడి గల సూటి దృక్కులతో పరిశీలించి, తాను పరిశీలించిన దాన్ని ఏమరుపాటు లేని మృదువైన మేధస్సుతో అంచనా వేయగలిగారు. ఆయనను వ్యక్తులు గానీ, గొప్ప గొప్ప అభిప్రాయాలు గాని, తన సొంత అభిప్రాయాలు గానీ, తన మనస్సులోని కరుణా గుణం గానీ ఏమరుపాటుకు గురి చేయలేదెప్పుడూ. అయినా ఆయన మనకెన్నడూ కఠినంగా గానీ నిరాసక్తంగా గానీ కన్పించరు.

ఆయనశైలి ఈ విధంగా ఒక వినూత్నమైన లక్షణం ఒక సొగసు సంతరించుకుంది. ముఖ్యంగా సమకాలీన కాలంలో దీనిని గుర్తించే వాళ్ళు గానీ దీనికి విలువ ఇచ్చేవాళ్ళు గానీ లేనప్పుడు ఇది ఒక అమూల్యమైన లక్షణం అయింది. ఈ సొగసనేది విశిష్టమైనదీ, అసాధారణమైనదీ కూడా. ఇది సమతుల్యత నుండి క్రమశిక్షణ నుండి, స్వప్రతిభపై విశ్వాసం నుండి వికసించింది. 'ఈశైలి ఒక లాఘవము మాత్రమే కాక ఆసువుగా శిల్పం పై తన ముద్ర వదిలే నైపుణ్యం; పై పొరలలో భాషని మార్చేది కాక వస్తువుని మలచటంలో ప్రతి వాక్యాన్ని నిర్దిష్టంగా తీర్చిదిద్దగలది.

ఇటువంటిశైలి ఫలితం బెన్‌వాంటె రచనలలో వివిధ విధాలుగా ఉన్నా అది నిష్ఫలమవ్వని చాతుర్యం మీద, వస్తువుపై చెదరని ఏక దృష్టిమీద ఆధారపడి ఉంది. శ్రమలేకుండా, పైపై మెరుగులు లేకుండా కావ్య వస్తువు నుండి కావాల్సిన రసం ఆయన రాబట్టుకోగలరు. రాసే విషయం ఎంత విలువైందీ, ఆసక్తి కరమైందీ అయినా ఆయన దానిని స్వచ్ఛంగానే పాఠకులకి చేరుస్తారు. అది ఆయనలోని శాస్త్రీయ గుణం.

జీవితంలోని వివిధ పార్శ్వాల్ని, ఒడిదుడుకుల్ని, పాత్రల మధ్య మారే సంబంధాల్ని, పంతాలు పట్టింపుల్ని సత్యాన్ని అతి దగ్గరగా యథార్థ వాద దృష్టితో చిత్రించటం ఆయన ముఖ్యోద్దేశం. అయితే ఈ 'యథార్థవాదం' అనే అలవాటైన మాటలోనుండి సాంఘిక దృష్టి, సాధారణమైన దార్శనికత, శైలిని శైలి కోసమే తీర్చిదిద్దటం, మొదలైన సాంప్రదాయకంగా వస్తున్న లక్షణాల్ని తీసేయాలి. ఆయన సాధారణమైన దానిని మించి ఏదైనా తలపెట్టినప్పుడు ఆలోచనలను రేకెత్తించటం, సమస్యలకు పరిష్కారం, మూఢ నమ్మకాలను తొలగించటం, మానవుల్లో కరుణానుభూతి పెంపొందించటం - ఇలాంటివి చేసేప్పుడు ఆయన సాహిత్యంలోని యథార్థ దృష్టికి భంగం కలుగకుండా అతి జాగ్రత్తగా ఉంటారు. ఏ నాటక రచయిత నైనా వ్యామోహ పరచగల నాటకీయతలోని ఆకర్షణకు కూడా లొంగకుండా ఎంతో క్రమశిక్షణతో రాయగలరు. సంఘర్షణలోని తీవ్రతను పెంచో, సంఘటనలకు రంగులు పులిమో, భావావేశాలను ప్రయత్న పూర్వకంగా రేకెత్తించో యథార్థ దూరమైన నాటకీయతను ఆయన జనాకర్షణీయంగా దిద్దాలనుకోలేదు. అలాగే ఆయనెప్పుడూ సున్నితమైన అద్దగీతల్ని చెరిగి పోనివ్వలేదు.

జన్మతహా అసాధారణమైన ప్రతిభతో పుట్టిన నాటక కర్తైన ఆయన ప్రతిభ నాటక రంగానికి అనువుగా రచించటంలో ప్రకటిత మవుతుంది కానీ, నాటకీయత కోసం ప్రత్యేకించి సృష్టించే తప్పుడు సంప్రదాయాల్ని బట్టి కాదు.

ఆయన రచనలు ఎక్కువగా 'కామెడీ' లో జరిగినా ఈ పదానికి స్పానిష్‌లో విస్తృతమైన అర్థం ఉంది; వీటిని మామూలుగా విషాదాంతంలేని నాటకాలుగా మనం గుర్తించవచ్చు. ఒకవేళ విషాదాంతం ఉన్నా వీటిని మనం 'డ్రామా' లనవచ్చు. బెన్‌వాంటె రాసిన అలాంటి నాటకాల్లో అసాధారణమైందీ మనను కదిలించి వేసేది 1913లో వచ్చిన 'The Wrongly Loved' ఆయన రచించిన మరెన్నో రొమాంటిక్‌గా ఉన్నవి, అద్భుతమైనవీ నాటకాల్లో కొన్ని విశిష్టమైన కవితాత్మగలవి ఉన్నాయి.

కాకపోతే ఆయన రచనల్లో ప్రాముఖ్యం గలవి కామెడీలు. ఇందులో గంభీరత మరియు సరదా కూడా కలసి ఉంటుంది. అలాంటివే చిన్న చిన్న కామెడీలు స్పానిష్ సాహిత్యంలో ఒకనాటి ఉత్కృష్ట సాంప్రదాయంలో ప్రత్యేక ప్రక్రియగా రూపొందించుకున్నవి. వీటిలో బెన్‌వాంటె మహోన్నతమైన సృష్టి చేశారు. వీటిలో సులువుగా వెలువడే హాస్యం, వ్యంగ్యం, కరుణరసం, ఆయన సొగసైన శైలీ అన్నీ కన్పిస్తాయి. అందులో కొన్ని 'For Small Reasons' (1908), 'Love Frightens' (1907), 'Smoking Prohibited' (1904). అలాంటివే ఆణిముత్యాలు ఆయన హాస్యపు భోషాణంలో మరెన్నో, సంఘర్షణలు కులాసాగా జరిగేవి, చులకలు తగులుతున్నా నొప్పి తెలియకుండా ఉండేవి.

బెన్‌వాంటె పెద్ద రచనల్లో వస్తువైవిధ్యంతోనూ వివిధ వర్గాల నుండి వచ్చిన పాత్రలతోనూ మనను ఆశ్చర్యపరుస్తారు. ఆ పాత్రల్లో చిన్న రైతులూ, చిన్న చిన్న నగరాలలోని అన్ని వర్గాలవారు, కళాకారుల నుండి ఊరూరూ తిరుగుతూ భుక్తి కోసం సర్కస్‌లో పని చేసేవారి వరకూ మనకు దర్శనమిస్తారు. ఈ సర్కస్‌లో పనివారిని కవి ఎంతో కరుణా దృష్టితో చిత్రీకరించటం వల్ల మిగిలిన వర్గాల వారందరి కంటే వీరిని ఆయన ఎక్కువ గౌరవించినట్లు తెలుస్తుంది.

మాడ్రిడ్, ఊహానగరమైన మొరాలెడాలోనూ ఎక్కువగా ఉన్నత వర్గాల జీవితపంథానే వీరు చిత్రీకరించారు. మొరాలెడా అనే ఈ ఊహా నగరం రకరకాల వర్ణనలతో వింత ఆకర్షణతో చిన్న నగరాల కుండే ప్రత్యేకత సంతరించుకుంది. 'The Company of Comedians' (1897) లో ఉన్నత స్థితికి చేరుకోవాలనే ఆశ గల రాజకీయ నాయకుడు ఆ చిన్న నగరానికి వెళ్ళి అక్కడ నిర్మలమైన ప్రజలనుండి ఏదో అస్పష్టమైన ఆశయానికి సమర్థత కూడగట్టుకోవాలని ప్రయత్నిస్తాడు. అలాగే 'The Governor's Wife' (1901)లో కూడా ఉన్నత స్థితి చేరుకోవాలనే తపన తన ప్రతిభను వ్యక్త పరచటం కోసం ఇంకా పెద్ద రంగం కోరుకుంటుంది. మొరాలెడా నిజానికి మాడ్రిడ్‌తో ఆకర్షింపబడి ప్రకాశించే ఒక ఉపగ్రహం లాంటిది. మాడ్రిడ్‌తో పోల్చి చూస్తేనే దీని ప్రపంచంలోని పూర్తి కామెడీ మనకు అర్థం అవుతుంది.

దుస్తులు, సంస్కృతి సంఘంలోని వర్గం ద్వారా నిర్ణయించబడినట్లే, వ్యక్తుల జీవితాల్లో ఒడిదుడుకులు, ఈ రాజధాని నగరం దాని ఆంతరంగిక జీవితాన్ని నిర్ణయిస్తాయి. బెన్‌వాంటె కళలో మనకు ఒక విస్పష్టమైన వికాశం కన్పిస్తుంది. ఆయన మొదట్లో వాతావరణం వర్ణన, జీవితంలో రంగులు, వివిధ అంశాల వర్ణన ద్వారా ఒక పాత్ర స్వభావాన్ని చూపించేవారు. నాటకీయత కథను ముందుకు నడిపించటానికి మాత్రమే పనికి వచ్చేది. జీవితంలో సుడిగుండాలను ఒక చోట కూర్చటానికి, ఒక వైపు వ్యక్తుల చిత్రీకరణ మరొకవైపు గుంపుల వర్ణన కలిపి ఒక చిత్రపటంగా అమర్చటానికి పనికి వచ్చేది. ఆయన కళాత్మకంగా ప్రామాణికమైన యథార్థానికి అద్దంపట్టి ఆ తరువాత దానినే తన ప్రమేయం లేకుండా వ్యక్తపరచనిచ్చేవారు.

తరువాత తరువాత వచ్చిన బెన్‌వాంటె రచనలు కొంత కఠినమైన శిల్పాన్ని సంతరించుకున్నాయి. బలమైన, గాఢమైన, ఆధ్యాత్మికమైన సంఘటనల చుట్టూ కథనం అల్లినా మొదట్లో సాంఘిక వర్ణనలతో, సరళంగా సాగిన కథనంలాగే ఇవి ఉంటాయి. ఆయన చిత్రించిన పాత్రలలో ఏదీ కృత్రిమంగా గానీ, దుర్గ్రాహ్యంగా గానీ, జీవితం నుండి ప్రత్యేకించబడి గానీ కనబడవు. ఇంతకుముందులాగే ఈ పాత్రలు ప్రపంచంతో దగ్గర సంబంధాలు కలిగి ఉన్నా, మనకు రచయిత చూపించేది మాత్రం నాటకానికి కావాల్సిన అంతఃకేంద్రం మాత్రమే. స్పష్టమైన కథనానికి అవసరమైనంత మేరకే పాత్ర చిత్రీకరణ చేయబడింది. పాత్రల మానసిక విశ్లేషణ వీరికి ఒక మార్గం మాత్రమే గమ్యం కాదు. నాటకంలో ఏ అంశమూ ముందుగా గానీ, అధిక శ్రమతో గానీ తయారు చేసిందిగా మన కన్పించదు. కథనంలోని ప్రతి అంశమూ జీవితం నుండి ఆశువుగా వెలువడి మనను అప్పుడప్పుడూ సంభ్రమపరచి, మనం ఆగి ఆలోచించగానే ఎంతో వాస్తవం అన్పింప చేస్తుంది. రచనా పద్ధతి యథార్థంగా ఉండి పూర్వపు విషాదాంత నాటకాలతో పోలికలు లేకుండా ఉంటుంది. పూర్వకాలపు వైభవాలను వర్ణించటం ఈ నాటకాల లక్ష్యం కాదు. సంభాషణల ప్రయోజనం కూడ ప్రాచీన జీవనాల్ని రెండు వైపులనుండి చూపించటం కాదు. జీవిత సత్యాల్ని ఆయన అనుభవాల్నుండే దర్శించి సరళంగా సాగే కథనం ద్వారా మనకందచేస్తారు.

స్థూలంగా చెప్పాలంటే బెన్‌వాంటె ప్రేక్షకుల్ని విసిగించరు. ఆయన గమ్యం సంఘర్షణలు ఐకమత్యంతో అంతమవటం, అది కొంత విషాదంతో కూడినదైనా. ఈ ఐకమత్యం నిర్లిప్తత, నిరాశలేకుండా కొంత వైరాగ్యం నుండి గొప్ప గొప్ప సంకేతాలేమీ లేకుండా జనిస్తుంది. వీరి పాత్రలు బాధలనుభవిస్తాయి, బంధాలను తెంచుకుంటాయి, ఐశ్వర్యం వెంటపడతాయి, సంఘర్షణలతో కుస్తీ పడతాయి, ఈ లోకాన్ని, తమ జీవితాల్నీ కూడా తరచి చూస్తాయి, తమలోని దోషాలనుండి, జీవితం పట్ల ఒక స్పష్టమైన, విస్తృతమైన అవగాహన పెంపొందించుకుంటాయి. చిట్ట చివరకు సాధించేది భావోద్రేకంలేని, అహంభావం లేని ఒక ఆధ్యాత్మకమైన భావన. ఇది ఎంత విలువైందంటే ఇదే

చేజారిపోతే, ఆత్మ విశ్వాసం చిన్నబోతుంది, ఐశ్వర్యం తృణప్రాయం అవుతుంది. చివరి ఫలితం మాత్రం ఒక పాత్ర తన వ్యక్తిగత నిర్ణయాలకు ఫలితాన్ని అనుభవిస్తూ స్వేచ్ఛగా అంతరాత్మ ప్రబోధంతో ఎన్నుకున్న మార్గం అవుతుంది కానీ ముందు వేసిన బాటల వెంట నడవటం కాదు.

చివరగా ఆయన విలక్షణమైన నాటకాలు రెండు మూడు ప్రస్తావించుకుందాం. ఇవి 1902లో వచ్చిన 'Conquering Soul', 1915లో వచ్చిన 'Self-respect', 1916లో వచ్చిన 'The White Scutcheon' వీటితో సరితూగ గల నాటకాలు కూడా మరెన్నో ఉన్నాయి. వీటిలో విశిష్టమైన లక్షణాలేమిటంటే స్వేచ్ఛమైన మానవత్వం, ముఖ్యంగా ఒక చురుకైన వ్యంగ్యం రచయితలో కన్పించేది. భావోద్రేకాలను స్వేచ్ఛగా విహరించనివ్వకుండా కట్టడిలో ఉంచటం కూడా ఆయనలోని మరో లక్షణం. ఆయనలో కవితా గుణాలన్నీ నిజానికి సమ తూకంలోనే ఉన్నాయి. వీరి శిల్పంలోని సొగసు ఒక శాస్త్రీయ లక్షణం. అలాగే వీరిలోని ఊహలు, అంతర్దృష్టి, నిబద్ధత దూరదృష్టితో సమన్వయం చేసినట్టు ఉన్నాయి. భావాలను వ్యక్తపరిచే తీరులోని నిర్మలత్వం, లో గొంతుకతో మాట్లాడే అలవాటు కూడా ఆ మూలం నుండే జనించాయి.

అయితే ట్యూటానిక్ పాఠకులకు మాత్రం ఇంతమంచి కళ ఒక పరాయి సంస్కృతి నుండి వెలువడిందని, వేరే సాంప్రదాయం వీటికి ఆధారం అని గుర్తుకు వస్తూనే ఉంటుంది. ఈ ట్యూటానిక్ జనులు నాటక రంగంలో ఆశించే కవిత్వం, రొమాన్స్ ఆదేశాలకు పరిచయం లేదు. మానవునిలో ప్రకృతిలో దాగి ఉండే సంధ్యనీడలు వీరికి తెలియవు. మానవుల్లోని అన్నిరకాల ప్రేరణలు వ్యక్తపరచాలనీ, వ్యక్తపరచటం సాధ్యమనీ వీరి నమ్మకం. వారి ఆలోచనల్లో ప్రకాశం, చురుకుదనం, స్పష్టత ఉండచ్చు. కానీ ట్యూటానికి జనులకి అవి కొంత బలహీనంగా, శూన్యవాతావరణానికి చెందిన వాటివలే వాటి అంతర్గత జీవితం కొంత పేలవంగా ఉన్నట్టు తోచవచ్చు. అలాగే దక్షిణాదివారికి ట్యూటానిక్ కళలో చాలా దోషాలు కన్పించవచ్చు. కాకపోతే వారూ మనం అర్థమైన విషయాల్లో ఒకరి నొకరు మెచ్చుకోవటం, భిన్నమైన కళా ప్రపంచానికి చెందిన గుణాల్ని వదలి వేయటం నేర్చుకోవాలి.

స్పానిష్ రచయిత బెన్‌వాంటె సంఘ జీవనాన్ని వ్యంగ్యంగా చిత్రించటం వదిలేసి జీవితంలోని క్లిష్టమైన సంఘర్షణల్నీ, సమకాలపు అలజడిని ఆశల్నీ వివరించిన రచనల్ని ఆయన స్వదేశస్తులు అభిమానించినంతగా ఇతరులు అభిమానించక పోవచ్చు. ఇది 'The Best of Stars' మొదలైన రచనల విషయంలో సత్యం.

ఆయన కళలో లోపాల్నెంచాలని నేను ప్రయత్నించలేదు, ఆయన రచనల్లోని ముఖ్యమైన అంశాలు, ఆయన దేశానికి కాలానికి చెందినవాటి గురించి వివరించాను. ఆయనంత వివరంగా ఏ సమకాలీన నాటక కర్త కూడా తన చుట్టూ ఉన్న లోకాన్ని అన్ని కోణాలనుండి పరిశీలించి, నిజాయితీగా, అంత సన్నిహితమైన శిల్పంతో కలకాలం నిలిచిపోయేలా స్వచ్ఛంగా నిర్భీతిగా చిత్రించలేదు. సాంప్రదాయ

స్పానిష్ కవిత్వం గాఢమైన, ధృఢమైన బెరుకెరగని యథార్థవాదంతో మిళితమై ఉంటుంది. వాస్తవాలనుండి పుట్టిన హాస్యం దీనికి ప్రాణం. బెన్‌వాంటె వాస్తవమైన పాత్రల పైన ఆధారపడిన ఆధునిక హాస్య కావ్యాలు శాస్త్రీయమైన ఆత్మ గలవెన్నో నిర్మించారు. ఆయన ఒక పురాతనమైన సాంప్రదాయానికి, ఉత్కృష్టమైన శైలికి గొప్ప వారసుడు.

## జీవిత చరిత్ర

యాసింటొ బెన్‌వాంటె (1866-1954) ప్రఖ్యాతి గాంచిన పిల్లల వైద్యుని కుమారునిగా మాడ్రిడ్‌లో జన్మించారు. చట్ట విద్యనభ్యసించిన వీరు, తండ్రి మరణ సమయంలో హాయిగా జీవించటానికి సరిపడే ఆస్తులివ్వగా, చదువు మధ్యలో ఆపేసి ఫ్రాన్స్, ఇంగ్లండ్, రష్యా దేశ యాత్రలు చేశారు. స్పెయిన్‌కి తిరిగి వచ్చింతరువాత తరచూ వార్తాపత్రికలకు, వార మాస పత్రికలకు రాయటం సంపాదకీయం వహించటం చేస్తుండేవారు. 1933లో ఒక కవితా సంకలనం, 1892-93 మధ్య రాసిన స్త్రీల ఉత్తరాలు ఆయనకు గుర్తింపు తేగా, 1902లో స్త్రీల ఉత్తరాలు మరో పుస్తకం ప్రచురించారు. ఈ ఉత్తరాలు ప్రతిభావంతమైన ఆయన శైలికి పేరు తెచ్చి పెట్టాయి. నాటక కర్తగా మారిన ఆయన మొదట ప్రచురించింది. 'The Fantastic Theatre'. అయినా తొలిసారిగా ఆయనకు గుర్తింపు తెచ్చినవి 1894లో వచ్చిన 'Another Nest', 1896లో మాడ్రిడ్ ఉన్నత వర్గాలపై చేసిన వ్యంగ్య రచనలో 'High Society'. బెన్‌వాంటె నాటకాలు అన్ని వర్గాల జీవితాలనూ చిత్రిస్తాయి. ఈ నాటకాలు కొంత గంభీరంగానూ, కొంత హాస్యంగానూ, యథార్థ జీవిత చిత్రీకరణతో, కొంత అద్భుత రసంతోనూ తొణికిసలాడుతూ ఉన్నా ఆయనకు ఎక్కువగా పేరు తెచ్చినవి మాత్రం వ్యంగ్య రచనలు, ప్రహసనాలు. మాడ్రిడ్‌గానీ కాస్టైల్‌లోని ఊహా నగరమైన మొరాలెడాగానీ ఆయన వ్యంగ్య నాటకాలకీ తరచూ నేపధ్యం. మొదట్లో రాసిన నాటకాల్లో ఆయన దృష్టి ఎక్కువగా యథార్థ సాంఘిక చిత్రణ పైనే ఉండగా తరువాత తరువాత ఆయన సాంద్రత గల శిల్పం వైపు మొగ్గు చూపారు.

బెన్‌వాంటెవిగా ప్రఖ్యాతిగాంచిన నాటకాలు 'The Governor's Wife' (1901), Autumenal Roses' (1905) కాగా, మానసిక విశ్లేషణ పరంగా ప్రాముఖ్యం గల 'The Lady of the House' (1908), 'The Wrongly Loved' ఆయన గొప్ప రచనలు. వీటితోపాటు ఆయన రాసిన 'The Bounds of Interest' (1907) ను తరచూ ఆయన ప్రముఖ రచనలుగా పేర్కొంటారు. ఎక్కువగా నాటక రంగంపై ప్రదర్శించిన నాటకం గూడా ఇదే. దుష్టత్వం కూడా అవసరమేనన్న భావనను సూచించే విలక్షణమైన ఈ నాటకం సున్నితంగా రెండర్థాలు ధ్వనిస్తూ ఒక లాంటి వ్యంగ్య పూరితమైన విరక్తిత కూడా ఉంటుంది. మరుపురాని వీరి మరో నాటకం 'Sons, Fathers of Their Parents' ఆయన మరణించిన సంవత్సరంలో వెలుగు చూసింది. 1941, 1955ల మధ్య ఆయన నాటక సంకలనాలు పది సంపుటాలుగా వెలువడ్డాయి.

# రాహుల్ సాంకృత్యాయన్
# ఘుమక్కడ్ శాస్త్ర (1946-48)

- డా॥ యమ్. ఆదినారాయణ

''ఎంత లెక్క తిరిగినా ఏమి లేదురా - చింత చేసి చూడకున్న వింత లేదురా!'' అనుకుంటూ తత్త్వగీతాలు పాడుకొనే ప్రజలు ఎక్కువుగా ఉన్న మన భారతదేశంలో క్రీ॥శ॥ 1893 నుండి 1963 సంవత్సరాల మధ్య జీవించిన రాహుల్ సాంకృత్యాయన్ తన 70 సంవత్సరాల జీవితంలో రాసిన మొత్తం గ్రంథాల సంఖ్య 127. అయితే వాటిలో అచ్చంగా సాహసయాత్రల గురించి రాసినవే 22 ఉన్నాయి.

1926లో రాసిన మొదటి యాత్రా గ్రంథం ''మేరీ లధక్ యాత్ర'' నుంచీ 1960లో రాసిన ''చీన్ మే క్యా దేఖా?'' వరకూ, అంటే దాదాపు జీవితం చివర వరకూ, తాను చేసిన యాత్రల గురించి రాస్తూనే ఉన్నాడు. వాటి ప్రాముఖ్యతను ఏనాడూ అశ్రద్ధ చేయలేదు రాహుల్జీ.

కేంద్ర సాహిత్య అకాడమీ వారు రాహుల్జీని, మరణానంతరం ఇరవై సంవత్సరాల తర్వాత గుర్తించి, భారతీయ సాహిత్య నిర్మాతల్లో ఒకడిగా చేర్చి ఆయన మిత్రుడు ప్రభాకర్ మ్యాచ్వే చేత 1983లో మోనోగ్రాఫ్ రాయించారు. ఆ చిన్న పుస్తకంలో చాలా వివరాలు వున్నాయి.

నిజానికి రాహుల్జీ భారతదేశంలో మొదటి యాత్రా కళా సాహిత్య తత్త్వవేత్త మాత్రమే కాకుండా సంచార సామ్రాట్ కూడా. ఇంకా చెప్పాలంటే తిరుగుబోతుల గురుదేవుడు. దేశ దిమ్మరుల ఆశాజ్యోతి.

రాహుల్జీ తెలుగువారికి చాలా కాలంగా పరిచయం. ఆయన 1944వ సం॥లో కిసాన్ మహాసభల్లో పాల్గొనటానికి విజయవాడ వచ్చాడు. ఆ సభకి బెంగాల్ చిత్రకారుడు చిత్తప్రసాద్ కూడా వచ్చి బొమ్మలు వేశాడు.

ఆ మరుసటి రోజు రాహుల్జీని సంజీవ్దేవ్గారు తుమ్మపూడికి ఆహ్వానిస్తే వెంటనే బయలుదేరి వెళ్లాడు. ఆ గ్రామీణ వాతావరణంలో రాహుల్జీకి వొళ్లు పులకరించి మన బకింగ్హామ్ కెనాల్లోనూ, కృష్ణా నదిలోనూ ఈతలు కొడుతూ పల్టీలు వేశాడు. యాభై ఒక్క సంవత్సరాల వయస్సులో నాగార్జున కొండ ఎగురుకొంటూ ఎక్కాడు. పుల్లారెడ్డిగూడెం పరిసరాల్లో కన్పించిన సంచార లంబాడి కుటుంబం ఎదురైనప్పుడు వారితో మాట్లాడి సంజీవ్దేవ్కి తన భాషాపాండిత్యాన్ని రుచి చూపించాడు. ఆ మూడు రోజుల ముచ్చట ముగిశాక మరెప్పుడూ మన రాష్ట్రం రాలేదు.

ఆ మరుసటి సంవత్సరం ఆహ్వానం మీద రష్యా వెళ్ళి లెనిన్ గ్రాడ్లో ఉన్న తన భార్యా బిడ్డలని కలిశాడు. అదే సంవత్సరంలో 'ఘుమక్కడ్ శాస్త్ర' రచనకి పునాది పడింది.

---

డా॥ యమ్. ఆదినారాయణ, అసోసియేట్ ప్రొఫెసర్, ఫైన్ ఆర్ట్స్ డిపార్టుమెంట్,
ఆంధ్ర యూనివర్శిటీ, విశాఖపట్నం.

నూట పదహారు పేజీలు ఉన్న ఆ చిన్న పుస్తకాన్ని రాయటం 1946లో పూర్తయింది. ఆ తరువాత ఇరవై సంవత్సరాలకి, 1966లో, ఆలూరి భుజంగరావుగారు దాన్ని అద్భుతంగా అనువాదం చేయడమే కాకుండా మనసుకి హత్తుకుపోయే పేరు పెట్టారు. అదే ''లోక సంచారి''. అప్పటి నుండి ఆ ఐదు అక్షరాలు యాత్రాభిలాషులకి 'పంచాక్షరీ మంత్రం' మాదిరిగా పని చేస్తూనే ఉన్నాయి.

ఒక్క భారతీయ సాహిత్యంలోనే కాకుండా ప్రపంచ సాహిత్యంలో కూడా అలాంటి గ్రంథ రచన ఇప్పటి వరకూ జరుగలేదు అనటం అతిశయోక్తి కాదు. యాత్రలు చేయటమే జీవిత లక్ష్యంగా భావించి యాత్రికుడుగానే జీవితాన్ని గడపాలని ధృడంగా నిశ్చయించుకొని చివరి శ్వాస వరకూ తన సిద్ధాంతాలకి ఊపిరి పోసిన మహా యాత్రికుడు, పండితుడు రాహుల్జీ.

యువకులు ఎక్కువమంది యాత్రికులు కావాలనీ వారి పట్టుదల మీద నమ్మకంతో, వారి భవిష్యత్ పట్ల ఆశతో, వారి కలల పట్ల ప్రేమతో ''దేశాటనం చాలా గొప్పది, కళా ప్రాభవాల్ని, సత్యాన్ని, ధార్మిక సద్భావనల్ని చాటటానికి చేసే మహాప్రస్థానం ఇది'' అని ఆ పవిత్ర సృజనాత్మక కార్యం యొక్క గొప్పతనాన్ని విపులీకరించాడు. అలాగే ''లోక సంచారి ప్రపంచాన్ని ప్రేమిస్తాడు. మృత్యువుకు భయపడడు. అతనికి పరిచయం అయిన ప్రతివారి మీద అనంతమైన స్నేహభావాన్ని కురిపిస్తూ ఉంటాడు. లోక సంచారి హృదయంలోని ఈ స్నేహభావనే అతనికి నిత్యం మధుర స్మృతుల్ని కలిగిస్తూ ఉంటుంది'' అంటూ సంచారుల సుకుమార హృదయ వైశాల్యాన్ని తెలియజేస్తాడు.

మనసులో ఊహించుకొనే యాత్రలకి నిజరూపం ఇవ్వాలనుకొనే యువతీ యువకుల కోసం ఘుమక్కడ్ శాస్త్రాన్ని రాశాడాయన. పక్షిలాగా పైకెగరాలనీ, చేపలాగా నీటిలో ఈదాలని ప్రతి ఒక్కరికి ఆశ ఉంటుంది.

ఆ రచనలు చదివి రాహుల్జీని గురువుగా భావించి, ఆ నామస్మరణ చేసుకొంటూ ఎందరో యాత్రలు చేశారు. కాని యాత్రా సాహిత్యం అంతగా రాలేదు. యాత్రలు చేయటం ఒక ఎత్తు అయితే ఆ అనుభవాల్ని గ్రంథరూపంలో పెట్టడం ఇంకో ఎత్తు. వాటిని పదిమంది చేత చదివించేలా చేయటానికి ఆ యాత్ర ఉద్దేశాలు బలంగా ఉండాలి. శైలి అర్థమయేలా ఉండాలి. రాహుల్జీ చరిత్రకారుడు, కళాకారుడు కాబట్టి అతని యాత్రా సాహిత్యం ఈనాటికీ జీవిస్తూనే ఉంది. ప్రతి సంవత్సరం వస్తున్న వసంతం ఆ గ్రంథాలకి కొత్త రంగులు పూయిస్తూనే ఉంది. వాటి పట్ల యాత్రా ప్రేమికులకి ఆకర్షణ పెరిగిపోతూనే ఉంది.

నేను ఇంటర్ మీడియట్లో ఉండగా ఈ ఘుమక్కడ్ శాస్త్రాన్ని చదివాను. అది నా ఒక్కడి కోసమే రాసినట్లుగా భ్రమించి లైబ్రరీలో ఎవరూ లేని ఒక మూలకి వెళ్ళి, ఊపిరి బిగపట్టి, ఆయన చెప్పే రహస్యాలు మరెవరూ వినకూడదు అనుకుంటూ ఆ యాత్రోపనిషత్తుని పంచేంద్రియాలకు వొంట పట్టించుకొన్నాను.

''బంధనాలను తప్పించుకొని పక్షిలాగా స్వేచ్ఛగా తిరగండి. ప్రపంచం మీకు స్వాగతం పలకటానికి సిద్ధంగా ఉంది. మీ రచనల ద్వారా ఆ యాత్రానందాన్ని అందరికీ ఇవ్వండి'' అని ఉద్బోధిస్తుంది ఈ చిన్న పుస్తకం.

వెనుకబడిన జాతుల్లోకి, ఆదిమ సమాజాల్లోకి వెళ్లి సేవ చేయటానికి ఒంటరి జీవితమే మంచిదనీ, యాత్రికుడు అనేవాడు మృత్యువుకైనా భయపడకూడదని మన కర్తవ్యాన్ని గుర్తు చేస్తుంది. వస్తువుల మాదిరి ఒక చోట పాతుకొని పోకుండా పచ్చదనాన్ని పండించే సెలయేరుల్లాగా విశ్వమంతా పర్యటించండి అంటూ వేకువజామున కూసే వేసవి కోయిల లాగా మాటిమాటికి మనకి గుర్తు చేస్తాడు రాహుల్జీ. మనలో చైతన్యాన్ని నింపి పురోగతి వైపు అడుగులు వేయిస్తుంది ఈ రచన. లోక సంచారుల వలన అందరిలో ప్రేమలు పెరుగుతాయని తద్వారా విశ్వమానవ కళ్యాణం జరుగుతుందని ఆశించి రాసిన గొప్ప పుస్తకం ఇది.

పువ్వుతో వాసన కలిసిపోయినట్లుగా యాత్రలూ, రాహుల్జీ కలిసిపోయారు. మనమందరం చేయాలనుకొనే యాత్రల్ని ఒక పద్ధతి ప్రకారం చేస్తే వాటిని నిజం చేయవచ్చనీ ఆశాభావం కలుగజేశాడు. నేను యాత్రల గురించి కలలు కంటూ ఉంటే వాటికి మార్గదర్శకత్వం వహించాడు రాహుల్జీ.

లోక సంచారులు ఎంత వయస్సులో బయలుదేరాలి? ఎలాంటి విద్యార్హతలు కావాలి? లలిత కళలు అవసరమా?, ప్రేమ, పెళ్ళి ఎంతవరకు అవసరం?, ఆరోగ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు; దేశపటాలు ఎలా చదవాలి? ఏయే పనులు నేర్చుకొని ఉండాలి లాంటి అనేక ప్రశ్నలకి సమాధానం ఇస్తూ దేశంలోని సంస్కృతి, కళలు రక్షించబడాలంటే యాత్రికుల కృషి చాలా మటుకు అవసరం అని ఉపదేశం చేసాడు. స్త్రీలను కూడా యాత్రలు చేయమని ప్రోత్సహించిన రాహుల్జీలో ఎన్ని ఆధునిక భావాలున్నాయో తెలుస్తుంది.

మానవ జీవితాదర్శం శాంతి. మన ఆత్మలకి అలాంటి శాంత రసాస్వాదన ఎంత అవసరమో తెలియజేస్తూ దానికి సంచారమే సరైన మార్గమని చెప్పిన శాంతి దూత రాహుల్జీ. ఘుమక్కడ్ శాస్త్రంలో ఇన్ని బలమైన, అవసరమైన విషయాలు ఉండబట్టే ప్రతి పాఠకుడూ యాత్రానందం అనే మేఘం మీద తేలిపోతున్న అనుభూతికి లోనవుతున్నాడు.

ఇలాంటి గొప్ప గ్రంథ రచన జరిగిన 1946వ సంవత్సరంలో రాహుల్జీ లెనిన్‌గ్రాడ్ యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా ఉన్నాడు. అది ఆయనకి మూడవ రష్యన్ అనుభవం. ఆ 53 సం॥ల వయస్సులో రష్యన్ భార్య 'లోల' తోను, ఎనిమిది సం॥ల వయస్సు వచ్చిన కొడుకు 'ఇగోర్'తోను సంసార జీవితంలోని ఆనందాన్ని అనుభవిస్తూ ఉన్నా, ఆ జీవితంలో తగ్గిపోతున్న స్వేచ్ఛనీ; పెరిగిపోతున్న తన వయస్సుని గుర్తించి తత్త్వవేత్తగా మారి ఈ రచన చేసి ఉంటాడు.

పరిసరాలలో స్వేచ్ఛగా, సంతోషంగా తిరుగుతూ బళ్ళమీద, గుడారాలతో సంచారం చేస్తున్న 'సిగాన్' జిప్సీలని చూచి ఎంతో ఆనందించి ఉంటాడు. అలెగ్జాండర్ పుష్కిన్ జీవితం, జిప్సీల సాహిత్యం చదివే ఉంటాడు.

రాహుల్జీ యవ్వనం అంతా టిబెట్, యూరప్ యాత్రల్లోనూ, జైళ్ళలోనూ గడిచిపోయింది. ఇప్పుడేమో తనకి తోడుగా కుటుంబం ఏర్పడింది. తన సాహసయాత్రల జీవితం 1938లో తన నాల్గవ టిబెట్ యాత్రతో ఆగిపోయింది. యాత్రలు చేయాలని మనసు కోరుకొంటున్నా వాటిని ఆచరణలో పెట్టటానికి శరీరం ఒప్పుకోవటం లేదు. మొదటిసారిగా కొంత విశ్రాంతిమయ జీవితాన్ని గడుపుతున్న ఈ సమయంలో ''యాత్రికుల్ని తయారు చేయటం చాలా ముఖ్యం'' అనుకొని వారికోసం ప్రత్యేకంగా రాసిన పుస్తకమే ఘుమక్కడ్ శాస్త్రం. భావితరాల యాత్రికుల కోసం విశ్రాంతి లోనూ నిర్విరామంగా రచనలు చేయవలసి వచ్చింది. భవిష్యత్తులో తనలాంటి సంచారుల్ని తయారు చేయాలనే ఉద్దేశ్యంతో వారిని ప్రేమలో పడవద్దని గట్టిగా హెచ్చరించాల్సి వచ్చింది ఈ పుస్తకంలో.

ఇవన్నీ ఈ రచనకి ప్రత్యక్ష ప్రేరణ అయితే పరోక్ష కారణాలు మాత్రం తన సొంత 40 సంవత్సరాల యాత్రానుభవం. తాను యాత్రా సాహిత్యాన్ని గత 16 సంవత్సరాలుగా రాస్తున్నా ఏ ఒక్కరూ యాత్రికులు కాకపోవటం ఆయన్ని బాగా నిరాశపరచి ఉంటుంది. ''తన తరువాత ఎవరు?'' అనే ప్రశ్నకి సమాధానం శూన్యం అయినప్పుడు ఇగోర్‌తో పాటుగా యువకులనందర్నీ తన బిడ్డలే అనుకొని, వారిలో కొందరైనా తాను కొనసాగించిన యాత్రా సాహిత్య ఉద్యమాన్ని ముందుకి నడిపించుకొని పోయే ధీరులు, పండితులు అవుతారని ఆశిస్తూ, వారిని దీవిస్తూ రచించిన మధుర స్వప్నం ఈ ఘుమక్కడ్ శాస్త్రం.

తన ఒడిలో ఆటలాడుకొంటున్న బుజ్జి యాపిల్ బుగ్గల రష్యన్ బాలుడు ఇగోర్‌కి రాహుల్జీ హిందీలో చెప్పిన యాత్రా పాఠమే తెలుగువారు చదువుకొంటున్న లోకసంచారిగా నేను భావిస్తాను. తన పాదాలకి బలం తగ్గిపోతున్న సమయంలో యువకుల శక్తివంతమైన పాదాలు కంటున్న కలలని చదివి వాటికి తాను చెప్పిన తాత్త్విక భాష్యం ఘుమక్కడ్ శాస్త్రం.

రెండవ ప్రపంచ యుద్ధానంతరం విధించిన ఆంక్షల వలన అప్పటి స్టాలిన్ ప్రభుత్వం రాహుల్ భార్యా బిడ్డల్ని ఇండియాకి పంపించకపోయేసరికి, కొండంత దిగులుతో 1947 ఆగష్టు 17న బొంబేలో ఓడ దిగేడు రాహుల్జీ; తాను రాసిన 'ఘుమక్కడ్ శాస్త్ర' తోడుగా.

రోజులు గడిచినా రష్యన్ ప్రభుత్వ వైఖరిలో మార్పు రాలేదు. కాలం గడిచే కొద్దీ రష్యాకి, తనకీ దూరం ఎక్కువైంది. తన పితృ హృదయ వేదనని వెళ్ళబోసుకోవటానికి ఒక స్త్రీ తోడు అవసరమైంది. ఆ పరిస్థితుల్లో తనకి సెక్రటరీగా పనిచేస్తున్న కాలింగ్ పాంగ్ కన్య కమలని వివాహం చేసుకొని ముస్సోరిలో సొంత ఇల్లు ఏర్పాటు చేసుకొన్నాడు. అప్పుడు ఆయన వయస్సు 55 సంవత్సరాలు.

ఆ మరుసటి సంవత్సరం అంటే 1949లో ఘుమక్కడ్ శాస్త్రం అచ్చులోకి వచ్చి హిందీ పాఠకుల అరికాళ్ళకి చక్కిలిగింతలు పెట్టింది. ఈ పుస్తకానికి ముందు అట్టమీది బొమ్మ లోలది అయితే వెనుక అట్టమీద బొమ్మ కమలదిగా మధ్యలోని ప్రతి పేజీలో రాహుల్జీయే ప్రత్యక్షమౌతాడు; నా ఊహలో.

ఆ తరువాత ఆయన కుటుంబ బాధ్యతలతో పూర్తిగా మునిగిపోయినా 5 సం॥ల తర్వాత మరలా తేరుకొని తాను 'ఘుమక్కడ్ శాస్త్ర'లో వర్ణించిన ఆదర్శవంతమైన మొదటి శ్రేణి లోక సంచారిని కేంద్రం చేసి 'విస్మృత్ యాత్రిక్' అనే నవలని రాశాడు. దీని నాయకుడు గుప్తుల కాలంలో జీవించిన నరేంద్రయశుడు అనే బౌద్ధ భిక్షువు.

ఈ నవల 1955లో వెలుగు చూసింది. ఇది రాహుల్జీ ఆత్మకథలాగా మొదలై ఒక ఆదర్శ బౌద్ధ యాత్రకుడి జీవితంలాగా ముగుస్తుంది. కల్పిత పాత్ర నరేంద్రుడు 70 సంవత్సరాలు జీవిస్తే, నిజ జీవితంలో రాహుల్జీ కూడా అంతకాలమే జీవించడం యాదృచ్ఛికం.

అలాగే ఘుమక్కడ్ శాస్త్రంలో ''ప్రేమలో పడకండి'' అని యువతను హెచ్చరిస్తూ ''స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు అనుభవిస్తూ ఉండే ఒక సంచార పండితుడు సంసార బంధంలో చిక్కుకొని మతి చెడి దయనీయ పరిస్థితుల్లో మరణిస్తాడు'' అనే ఉదాహరణ ఇస్తాడు. కానీ నిజ జీవితంలో రాహుల్జీకి కూడా అలాగే జరిగింది. అంత స్పష్టంగా తన జీవిత కాలాన్ని; చివరి దశనీ ఎలా దర్శించాడో ఆయనకే తెలియాలి.

అంతటి ఉత్తమ పుస్తకం చివరి పేరాలో ''పండితులు ఈ పుస్తకాన్ని ఇంతకంటే శాస్త్రీయంగా రాయటానికి ముందుకు రావలసింది'' అని ఆహ్వానించాడు. నిజానికి ఈ పుస్తకం ఒక సంపూర్ణ విజ్ఞాన, ఆనంద, శాంతి మార్గసూచిక. భావితరాల యువకులు గమనం చేసుకోవాల్సిన సాహస యాత్రా గీతిక. రాహుల్జీకి ముందుగాని, ఆ తర్వాత గాని యాత్రా సాహిత్యానికి అంత ప్రాముఖ్యత ఇచ్చిన వారు లేరు. కవులు, చిత్రకారులు, శిల్పులు ఎంతో మంది ఉన్నా యాత్రికులు జన్మించటం లేదు. ఆయన కలలు నిజం చేసే వారిని ఆహ్వానించడానికి భారతీయ సాహిత్య ప్రియులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారు.

రాహుల్జీ యాత్రలు చేస్తున్న కాలంలో ఇంగ్లాండ్‌కి చెందిన విల్‌ఫ్రెడ్ థెసిగర్ అరేబియా ఇసుక ఎడారుల్లో సాహస యాత్రలు చేస్తున్నాడు. అలాగే రోనాల్డ్ అముడ్‌సేన్ మంచు నిండిన దక్షిణ ధ్రువ యాత్రల్లో ఉన్నాడు. ఫ్రాన్సిస్ క్రిస్టోఫర్ తాస్మాన్ సముద్రం మీద ఒంటరిగా యాత్రలు చేస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లో అడవి బాపిరాజు అజంతా ఎల్లోరాలు దర్శించి ఆ చిత్ర, శిల్ప, సౌందర్య దీప్తి ధారలలోని కళా కాంతుల్ని ఆస్వాదిస్తున్నాడు.

ఓల్గాసే గంగా పుస్తకంలో ప్రతి కథకి ఒక చిత్రం ఉంటే బాగుండేది అని భావించాడు రాహుల్జీ. ఆ అవసరం ఘుమక్కడ్ శాస్త్రానికి కూడా ఉంది. ఇకనైనా 'లోక సంచారి' పుస్తకాన్ని విడిగా మరిన్ని వివరాలతో అచ్చువేయటం మన కర్తవ్యం. అలా చేయటం వలన యాత్రాకళాభిమానులకి ఉత్సాహాన్ని, సాహిత్యకారులకి ఆనందాన్ని ఇచ్చినట్లు అవుతుందని నా భావన. ఆ శుభదినం త్వరలోనే రావాలని మనసారా కోరుకుంటున్నాను.

సంచార కళా కొలంబస్ రాహుల్జీ హిందీ రచనల్ని తేనెలూరించే తెలుగులోకి తర్జుమా చేసి లక్షలాది పాఠకులకి యాత్రానందాన్ని కలుగజేస్తున్న ఆలూరి భుజంగరావుగారికి అపారమైన ప్రేమతో ఈ వ్యాసాన్ని అంకితం చేస్తున్నాను.

# స్వగతం నుండి స్వగతానికి

- డా॥ యు. ఏ. నరసింహమూర్తి

(అక్టోబర్ సంచిక తరువాయి)

ప్రపంచంలోని అన్ని భాషల నాటకాలలోను స్వగతాలున్నాయి. స్వగతాలు సాధారణంగా తమ పరిసరాలలోంచి పుడతాయి, ఒక సాహిత్య ప్రయోజనాన్ని సాధిస్తాయి. తాత్త్విక సత్యాలు, మానసిక వ్యధలు, వినోద భావాలు, ప్రణయ సంబంధమైన లేదా ప్రహసనాత్మకమైన విషాద కథానికలు ఈ స్వగతాలలో కనిపిస్తాయి. ఇతివృత్త సంఘటనలో, పాత్ర చిత్రణలో స్వగతాలు అనుసంధాన మూలకాలుగా ఉపయోగిస్తాయి. పాశ్చాత్య రూపకాలలోని స్వగతాలు నాటకాల నుండి వేరు చేస్తే ప్రత్యేక రచనలుగాను, నాటకంలో అనుసంధిస్తే అందులోని అవిభాజ్యమైన అంశాలుగాను కనిపిస్తాయి. అసలు స్వగతమే గ్రీకు నాటకానికి మూలమని విమర్శకు లంటున్నారు.

"The soliloquy has grown-up with the drama from its beginnings, and indeed a near relation the monolog seems to have been largely instrumental in giving birth to the drama".[6]

భారతీయ నాట్య దర్శనం చాలా విశాలమైనది. వారు దశ రూపాలనే కాక అందులో ఇంకా అవాంతర రూప భేదాలను కూడా పరిశీలించి నిర్ణయించేరు. ప్రాచీనులు సర్వలక్షణ లక్షితములైన నాటకము - ప్రకరణము అనే రూపక భేదాల నుండి మిగిలిన రూపక భేదాలన్నీ ఆవిర్భవించాయని భావించినా ఆధునిక భారతీయ నాటక విమర్శకులు ఆ వాదాన్ని సహేతుకమైనదిగా అంగీకరించలేదు. వారి దృష్టిలో ఏక హార్యములు, ద్విహార్యములు అయిన భాణము - వీధి వంటి రూపక భేదాలతో దృశ్య కావ్య ప్రక్రియ ఆరంభమై క్రమ వికాసాన్ని పొంది పరిణత దశలో ప్రకరణ నాటక రూపాలను పొందినట్లుగా తెలుస్తుంది. భాణమనే రూపము పాశ్చాత్యులు తెలిపిన Monolog వంటిదే. అందుచేత స్వగతమే దృశ్యకావ్య ప్రక్రియకు మూలమైనదన్న అభిప్రాయం ప్రాచ్య పాశ్చాత్య నాటక విమర్శకులందరకు సమ్మతమైన, హేతుబద్ధమైన వాదంగా కనిపిస్తుంది.

ఆంగ్ల భాషలో స్వగతాన్ని Soliloquy అంటారు. లాటిన్ భాషలో సెయింట్ అగస్టిన్ **'Soliloquicem'** అనే పదాన్ని తయారు చేసాడు. **'Solus - loqui'** అనే రెండు పదాల కలయిక వలన ఆ పదమేర్పడింది. ఆ పదానికి తనలోతాను మాట్లాడుకోవడమని అర్థం. ఒంటరిగా మాట్లాడుకోవడమనే అర్థంలో అది స్థిరపడింది. రంగస్థలం మీద ఒకపాత్ర ఒంటరిగా ఉండాలి. తాను ఒంటరిగా ఉన్నానని అనుకోవాలి. కనీసం అలా అనుకునేలా మాట్లాడాలి. దానిని స్వగతమంటారు. ఒక్కొక్కప్పుడు రంగ స్థలం మీద ఇతర పాత్రలుంటాయి. అలాంటప్పుడు కూడా ఒక పాత్ర తనలో తాను మాట్లాడుకోవలసిన అవసరం ఏర్పడుతుంది. అటువంటి సందర్భాలలో ఆ పాత్ర తనపరిసరాలను

డా॥ యు. ఏ. నరసింహమూర్తి, విజయనగరం, మహారాజా కళాశాలలో తెలుగు శాఖాధ్యక్షునిగా పదవీ విరమణ చేసి, అక్కడే యు. జి. సి. ఎమిరిటస్ రీసెర్చి ఫెలోగా ఉంటున్నారు.

విస్మరించి, ఇతర పాత్రల ఉనికితో తనకేవిధమైన సంబంధమూ లేని రీతిని నటనలో కనబరుస్తూ స్వగతాన్ని కొనసాగించాలి. ఇటువంటి స్వగతం సాధారణంగా మరీ సంక్షిప్తంగా ఉంటుంది. ప్రేక్షకులను ఎంతో ప్రభావితం చేయగల స్వగతం మాత్రమే ఇటువంటి సందర్భాలలో రాణిస్తుంది. ఇటువంటి చోట్ల నటుడి సాత్త్వికాభినయంతో పాటు ఆంగిక విన్యాసాలకు అధిక ప్రాధాన్యం ఉంటుంది. కన్యాశుల్కం నాటకం ప్రథమాంకం రెండవ రంగంలో - అంటే మధురవాణి ఇంట్లో రామప్పంతులు ఉండగా గిరీశం ప్రవేశించిన సందర్భంలో ఇటువంటి స్వగతాలెక్కువగా కనిపిస్తాయి. హాస్యనిధులైన ఆదృశ్యంలోని స్వగతాలు, జనాంతికాలే దానికి మంచి రాణింపు తెచ్చాయి. పైనించి ''మైడియర్'' అన్న గిరీశం మాట వినబడగానే రామప్పంతులు ''అన్న, వేళగాని వేళొచ్చాడు గాడిదకొడుకు, తంతాడు కాబోలు, యేవిఁటి సాధనం, యీ మంచం కింద దూరుదాం'' అని తనలో తాను అనుకుంటాడు. అక్కడ మధురవాణి ఉండగా స్వగతం కొనసాగుతుంది. మధురవాణి గిరీశం కోసం చూస్తూ రామప్పంతుల్ని గమనించనట్లు నటించాలి. ఆ సరంభంలో అసలు మధురవాణి ఉనికినే విస్మరించినట్లు రామప్పంతులు పాత్రధారి నటించాలి. అప్పుడే ఆ స్వగతం సహజంగా రక్తి కడుతుంది. రంగం మీద మధురవాణి, గిరీశం మంచం కింద రామప్పంతులు ఉండగా పూటకూళ్లమ్మ ప్రవేశిస్తున్నట్లుగా తెలుస్తుంది. మధురవాణి ఆమెను గమనిస్తూ ఉండగా గిరీశం తనలో తాను ''మంచం కింద దూరుదాం'' అనుకుంటాడు. అప్పటికి తానక్కడ ఒంటరినే అనుకుంటాడు. కాని మంచం కింద ఇంకొకడున్నాడని తెలిసాక కూడా ఆ స్వగతం ''దొంగలంజ సరసుణ్ణి దాచిందోయ్ మంచంకింద'' అంటూ కొనసాగుతుంది. ఈ రంగంలో సన్నివేశ ప్రాధాన్యం కారణంగా అప్పటికప్పుడు పొడచూపిన లఘు స్వగతాలెక్కువ. వీటిని నటించేటప్పుడు నటుడు విలక్షణతను ప్రదర్శించవలసి ఉంటుంది. ఈ స్వగతాలతో పాటు ''రెండు వందలు దొబ్బిందిరా బాబూ'' అంటే ''నువ్వులేమైనా జాగర్త చేశారా?'' అంటూ మంచం కింద రామప్పంతులు గిరీశం కలిసి కొనసాగించిన జనాంతికాలు కూడా ఉన్నాయి. స్వగతానికి, జనాంతికానికి, ఆకాశ భాషితానికి, సంభాషణకు స్పష్టమైన తేడాలను చూపించడానికి తగిన అవకాశాన్ని కల్పించడంలో నాటక కారుడి నైపుణ్యం, నటించడంలో నటుడి ప్రతిభ వెల్లడి కాగలవు. హాస్యరస పోషణకు ఇటువంటి సన్నివేశాలు ఎంతైనా దోహదం చేయగలవు. అందుకు కన్యాశుల్కంలో కావలసినంత చోటుంది.

స్వగతాలు ఎంత చిన్నవైనా పాత్ర స్వభావాన్ని విపులంగా ఆవిష్కరించే సాధనాలుగా ఉపయోగ పడతాయి. కన్యాశుల్కం మొదటి అంకం రెండవ రంగంలో అగ్నిహోత్రావధాన్లు గిరీశం మాట్లాడుకుంటూన్న సందర్భంలో కరటక శాస్త్రి తనలో తాను ''యిన్నాళ్లకి మా అగ్నిహోత్రుడికి తగినవాడు దొరికాడు'' అనుకోవడం గిరీశం స్వభావాన్ని గూర్చిన కరటక శాస్త్రి అవగాహనను వెల్లడించడమే గాక, నాటకం మునుముందు ఎటు నడుస్తుందో సూచించేదిగా కూడా కనిపిస్తుంది. అలాగే గిరీశం వెంకటేశానికి చెప్పే చదువు ఎలాంటిదో గ్రహించగానే కరటక శాస్త్రి ''తర్ఫీదు మా

చక్కగా ఉంది. వీణ్ణి పెందరాళే తోవ పెట్టకపోతే మోసం వస్తుంది'' అని తనలో తాను అనుకుంటూ సూచ్యార్థ సూచన చేస్తాడు. కరటక శాస్త్రి అక్కడే ఉంటే గిరీశానికి ఉద్వాసన చెప్పేవాడే. కాని నాటకీయంగా అతడు రామచంద్రపురాగ్రహారానికి వెళ్లవలసి రావడంతో గిరీశం మోసాన్ని అడ్డుకోలేక పోయాడు. కరటక శాస్త్రి ఈ రెండు స్వగతాలకు నాటకంలో కనపడని ప్రాధాన్యం ఉంది. ఈ రంగంలోనే గిరీశం, కరటక శాస్త్రి, వెంకటేశం, వెంకమ్మ, బుచ్చమ్మ - ఇన్ని పాత్రలు రంగం మీద ఉండగానే అగ్నిహోత్రావధాన్లు తనలో తాను ''డబ్బు ఖర్చు లేకుండా వీడిచేత కాగితం ముక్కలన్నీ తర్జుమా చేయించేస్తాను'' అనుకుంటాడు. అందరి ఉనికిని తృణీకరించగలిగినంత ప్రలోభం ఆ పాత్రలో ఉందన్న లక్షణాన్ని ఆ స్వగతం అభివ్యక్తం చేస్తుంది. ఆ పాత్రధారి తదనుగుణమైన హావభావ ప్రకటనను చేయగలిగినప్పుడు అది రాణిస్తుంది. కన్యాశుల్కంలోని ఇటువంటి చిన్న చిన్న స్వగతాలు పాత్ర స్వకీయమైన మనస్థితిని ఆవిష్కరించడానికి, ఇతర పాత్రల శీల వృత్తులను విశ్లేషించడానికి ఉపకరించేవిగా ఉన్నాయి.

పాత్రల మధ్య నుండగా స్వగతాన్ని అభినయించడానికి నటుడు రంగ స్థలానికి ఒక పక్కగా వచ్చి సంభాషిస్తాడు అలాగే రంగస్థలం మీద లేనివారితో మాటలాడవలసి వచ్చినప్పుడు (దీనిని సాంప్రదాయిక నాటకాలలో ఆకాశభాషణం అంటారు. పాశ్చాత్య నాటకాలలోని Monology లక్షణం ఇందులో ఉంటుంది.) ఆకాశంవేపు చూడడంగాని, చెవి దగ్గర చెయ్యి పెట్టడం గాని చేస్తాడు. అలాగే మిగిలిన పాత్రలు వినకుండా ఒక పాత్రతో మాట్లాడవలసి వచ్చినపుడు ''మాట వినపళ్లేదు. కొంచెం ఇసుంటారండి'' అన్న మాదిరిగా నటిస్తాడు. పూర్వం నాటకాలలో ఇటువంటి సందర్భాలలో కొన్ని ముద్రలు పట్టేవారు. ఇప్పుడు అభినయమే గాని ముద్రలు లేవు. అందుచేత నటుడు స్వగతానికి, ఆకాశ భాషణానికి, జనాంతికానికి నటనలో స్పష్టమైన భేదాన్ని చూపించాలి. స్వగత పరగత భావ చాలనంలోని ఒక సున్నితమైన అంతరాన్ని ప్రదర్శించే ఇటువంటి సన్నివేశాలు నటుడికి, నాటక కర్తకు పరీక్షా సమయాలు. భావోద్వేగంతో ఒక పాత్ర తనలో తాను మాట్లాడుకునే సంభాషణను ఇంకొక పాత్ర వినేసన్నివేశం ఉంటుంది. ఆ పాత్ర విన్నట్లుగా స్వగతాన్ని పలికిన పాత్రకు తెలియదు. దానిని ''అతిశ్రుత స్వగతం'' (over heard soliloquy) అంటారు. రత్నావళి నాటికలో రాజు ఉత్కంఠతో తనలో తాను

''ఉప స్థిత ప్రియా సమాగమస్యాపి కిమిద మత్యర్థ ముత్తామ్యతిమే మనః అథవా -

తీవ్రః స్మరసంతాపోన తథాదౌ బాధతౌ యథాఽసన్నే।

తపతి ప్రావృషి నితరా మభ్యర్ణ జలాగమో దివసః ॥ - అని అనుకుంటాడు. ''ప్రియురాలు దగ్గరగా ఉన్నా నా మనసు ఎందుకిలా బాధపడుతూంది! అంతే కాబోలు. వర్షం పడే ముందు బాగా ఉక్కబోసినట్లు మన్మథ బాధ కూడా ప్రియురాలు సన్నిహితంగా ఉన్నప్పుడున్నంతగా మొదట్లో ఉండదు'' - అన్న ఈ సంభాషణ స్వగతమే. కాని ఉత్కంఠావివశుడైన రాజు ఇతరులకు వినపడేలా

ఈ స్వగతాన్ని పలుకుతాడు. దానిని విదూషకుడు వినడంతో కథ ముందుకు సాగుతుంది. కన్యాశుల్కం ఐదవ అంకం మూడవ రంగం ఆరంభంలో లుబ్ధావధాన్ల స్వగతం ఉంది. లుబ్ధావధాన్లు తనలో తాను మాట్లాడుకుంటూ ''అన్ని విధాలా యీ రామప్పంతులు నా కొంప తీసాడు'' అనుకుంటాడు. అది చాలా ఉద్వేగకరమైన సన్నివేశం. మాయగుంట ఏమయిందో తెలియక సతమతమౌతూ అర్థోన్మత్తస్థితిలో లుబ్ధావధాన్లు ఒక్కడే తనకు తానే మాట్లాడుకుంటూ ఆ మాట అన్నాడు. ఆ మాట రామప్పంతులికి వినిపించింది. ''యేవిఁటి మావాఁ రావఁప్పంతులంటున్నారూ?'' అంటూ అతడు ప్రవేశిస్తాడు. కన్యాశుల్కంలో ఇంకొకరీతి చిత్రమైన అతిశ్రుత స్వగతకల్పన ఉంది. ఐదవ అంకం ఆరవ రంగంలో దాసరివేషంలో ఉన్న శిష్యుడు ''యిల్లు యిల్లనియేవు! యిల్లు నాదనియేవు! నీ యిల్లు యెక్కడే చిలుకా'' అన్న తత్త్వం పాడుతుంటాడు. నిజానికి ఇది స్వగతం కాదు. అలాగని ఒకరిని ఉద్దేశించినదీ కాదు. తాను ఒంటరిననే భావనతో పలికే ప్రతి సంభాషణకు స్వగత లక్షణ ముంటుందనుకుంటే దీనిని కూడా స్వగతంగా పరిగణించాలి. శిష్యుడి ఆంతర్యం ఎలాగున్నా అభినయంలో మాత్రం ఇది స్వగతలక్షణం కలదే. ఇందులోని ఒక్కొక్క చరణం రామప్పంతులు దయనీయ స్థితిని జ్ఞాపకం చేస్తూ అతణ్ణి ఉద్వేగభరితుణ్ణి చేయడంతో అతడు ''యిది యిల్లు కాదా?'' ''వొల్ల కాట్లోనా! ఏవిఁటీ అపశిగునం పాటా!'' అనుకుంటూ ఉంటాడు. ఇవన్నీ వారిద్దరి మధ్య ముఖాముఖి జరిగిన సంభాషణలు కావనే విషయాన్ని గుర్తిస్తే ఇందులోని అతిశ్రుత స్వగత లక్షణాన్ని గ్రహించవచ్చును. అగ్నిహోత్రావధాన్లు దగ్గర కూడా దాసరి వేషంలో ఉన్న శిష్యుడు ''నీలాలకా యేల నీయాలుకా?'' అని పాడిన చోట మాత్రం వారిద్దరి మధ్య సంభాషణే నడిచింది. మొదటి తత్త్వం దాని ననుసరించిన స్వగతం రామప్పంతులు నిర్వేదాన్ని పెంచేదిగా కనిపిస్తే, రెండోపాట అగ్నిహోత్రావధాన్లను రెచ్చగొట్టడానికి ఉపయోగించింది.

రంగస్థలం మీద ఇతర పాత్రలు లేని సందర్భాలలో ఒకానొక పాత్ర ప్రేక్షకుల నుద్దేశించి ప్రసంగించే సందర్భాలుంటాయి. సాంకేతికంగా దీనిని స్వగతం అనడానికి వీలులేదు. ప్రేక్షకులతో పలికినది కూడా సంభాషణే అవుతుంది. పూర్వరంగ కల్పనలోను, నాటక పరిసమాపనంలోను భారతీయ రూపక కర్తలకు పాశ్చాత్య రూపక కర్తలకు కొంత భేదం ఉంది. నాంది, ప్రస్తావనలలో సూత్రధారునిది ప్రముఖ పాత్ర అయినా ఇతర పాత్రల సహాయం ఉంటుంది. భరత వాక్యం ఒక నటుడే పలికినా ఇతర పాత్రల సమక్షంలో ఆ పాత్రలు, ప్రేక్షకులు కూడా వినేలా పలుకబడుతుంది. పాశ్చాత్య రూప కాలలో ఉపయోగింప బడే Prolog, epilog వంటివి ఉంటాయి. అవి కూడా స్వగతాలు కావు. ఈ లక్షణాలేవీ లేకుండా ప్రారంభమయే ఆధునిక నాటకాలున్నాయి. అందులో స్వగతాలతో ఆరంభమయ్యేవి, స్వగతాలతో ముగిసేవి ఉన్నాయి. షేక్స్పియరు నాటకాలలో ప్రారంభంలో స్వగతాలన్నవి ఉన్నాయి. ముగింపులో స్వగతాలన్నవి ఉన్నాయి. నాటకారంభంలోను, అంతంలోను మాత్రమే కాకుండా రంగారంభంలోను, ముగింపులోను స్వగతాల నుపయోగించే లక్షణాలు ప్రాచీన నాటకాలలో కనిపిస్తాయి. భారతీయ రూపకాలలో మాత్రం ముగింపులో స్వగతం ఉండదు. రత్నావళి అనే

నాటికలోను, మృచ్ఛకటికమనే సంకీర్ణ ప్రకరణంలోను ప్రారంభంలో స్వగతాలు కనిపిస్తున్నాయి. ఇది చాలా అరుదైన పద్ధతి. Aescrylees, Seneca వంటి ప్రాచీనుల నాటకాలలో నాటకారంభంలో స్వగతాలున్నాయని పాశ్చాత్య నాటక విమర్శకులు పేర్కొంటున్నారు. నాటకారంభంలో ఆకాశ భాషితాన్ని (Monolog) కూర్చడాన్ని Seneca తన గురువైన Eceripides నుండి నేర్చుకున్నాడంటారు. మార్లో నాటకాలలో కూడా ప్రారంభ స్వగతాలుంటాయి. స్వగత కల్పనలో షేక్స్పియరుకు మార్లో మార్గ దర్శకుడంటారు. కొన్ని సందర్భాలలో పూర్వరంగ నిర్వహణలో భారతీయ రూపకాలలో సూత్రధారుడు నిర్వహించే విషయమంతా పాశ్చాత్య రూపకాలలోని ప్రారంభ స్వగతాలలో నిబంధింపబడతాయి. ప్రాచ్య పాశ్చాత్య రూపక మర్యాదలనన్నింటినీ గాఢమైన అభినివేశంతో విస్తృతంగా అధ్యయనం చేసిన గురజాడ కన్యాశుల్కాన్ని ''సాయం కాలమైంది'' అనే గిరీశం స్వగతంతో ఆరంభించి ''డామిట్! కథ అడ్డంగా తిరిగింది'' అనే గిరీశం స్వగతంతో ముగించి మసక చీకట్లో ఆరంభించిన నాటకాన్ని నిశిరాత్రిలో నిలిపి ఉంచడంతో ఒక గొప్ప నాటక శిల్పాన్ని ప్రదర్శించేడు. ఇది ఒక్క కన్యాశుల్కంలోనే కనిపిస్తుంది. ఇంకెక్కడా లేదు.

కన్యాశుల్కం నాటకాన్ని ముందు ప్రదర్శించినపుడు దానికి ముడుంబై వరాహ నరసింహ స్వామి వారు proloque రచించారని, దానిని మేడేపల్లి వేంకట రమణాచార్యుల వారు పఠించారని అంటారు.[7] కన్యాశుల్కం ముద్రిత ప్రతులలో అది లేదు. ఆ నాటకం గిరీశం స్వగతంతో ఆరంభమయింది. ఇటువంటి ఆరంభ స్వగతాలు వివరణాత్మకంగా (expositony soliloques) ఉంటాయని విమర్శకులు విశ్లేషించారు. షేక్స్పియరు నాటకాలలోని స్వగతాలను విశ్లేషించిన Morris Le Roy Arnold ఈ వివరణాత్మక స్వగతాలను (1) Initial exposition (2) Identification (3) Disgracing (4) Characterization (5) Villaincy (6) Narration అంటూ వేర్వేరు శాఖలుగా వర్గీకరించేడు.[8] గిరీశం ప్రారంభ స్వగతాన్ని నిశితంగా పరిశీలిస్తే అందులో పై లక్షణాలన్నీ కనిపిస్తాయి.

స్వగతాలు దృశ్యం ప్రారంభమయేటప్పుడు గాని, ముగిసేటప్పుడు గాని, రెండు పాత్రల సంభాషణ మధ్యంలో క్లుప్తంగా గాని నిబంధింప బడతాయి. దృశ్యం మొదలయేటప్పుడు రెండు పాత్రలు ఒకేసారి ప్రవేశించడాన్ని నివారించడానికి స్వగతాన్ని ఆశ్రయిస్తారు. రెండు పాత్రలు ముందుగా నిర్ణయించుకున్న ప్రకారం ప్రవేశించినా, అనుకోకుండా ప్రవేశించినా ఒక పాత్ర ప్రవేశానికి ఇంకొక పాత్ర ప్రవేశానికి మధ్య నుండే విరామాన్ని స్వగతంతో పూరించడం నాటకీయ ధర్మం. గిరీశం ముందుగా ప్రవేశించి పూట కూళ్లమ్మకు తనకు ఉండే సంబంధాన్ని, మధురవాణికి తనకు ఉన్న సంబంధాన్ని వివరించేడు. తన శీలమంతా ప్రేక్షకులకు తేటతెల్లమయేలా ప్రసంగించేడు. కట్టా విప్పా సమర్థత కలిగిన తన శక్తులన్నింటినీ ఈ స్వగతంలోనే ప్రేక్షకులకు పరిచయం చేసేడు. తన ఆంగ్ల సాహిత్య పరిజ్ఞానాన్ని, మాటకారితనాన్ని వ్యక్తం చేసేడు. ''నేను యేమో ఉద్యోగాలూ ఊళ్లూ యేలి తనతో వైభవం వెలిగిస్తాననే నమ్మకంతో ఉంది పూర్ క్రీచర్!'' అంటూ తన నాయక విరుద్ధ శీలాన్ని స్పష్టం చేసాడు. వెంకటేశాన్ని

తాను ఎందుకు అనుసరిస్తున్నాడో అతనికి తెలియనీయని గోప్య లక్షణాన్ని ప్రదర్శించేడు. ''ఎవరా వస్తున్నది! నా ప్రియ శిష్యుడు వెంకటేశంలా ఉన్నాడు'' అంటూ వెంకటేశం ప్రవేశాన్ని సూచించడంతో ఈ స్వగతానికి Monolog లక్షణం కూడా ఏర్పడింది. ''వీడితో వీడి వూరికి వుడాయిస్తే చాలా చిక్కులు వొదుల్తాయి'' అని ప్రణాళికా రచన చేయడంతో నాటకానికి బీజం వేసేడు. పాశ్చాత్యులు దీనిని నాటకీయ వ్యంగ్యం (Dramatic irony) గా భావిస్తారు. కన్యాశుల్కం నాటకంలోని చిక్కులన్నీ నాటకం మొదలు కాక ముందే ఏర్పడ్డాయి. మొదలయాక అవి క్రమంగా విడిపోవడం ఆరంభమయింది.

నాటకేతివృత్తాన్ని ప్రేక్షకులు సులభంగా అవగాహన చేసుకోవడానికి వివరణాత్మక స్వగతాలు ఉపకరిస్తాయి. అరిస్టోఫోన్స్, మోలియార్ వంటి నాటక కర్తలు ఈ విధమైన ప్రారంభ స్వగతాలను కూర్చడం మీద మోజు చూపించేరు. శృంగార, హాస్యరస ప్రధానాలైన నాటకాలలో ప్రారంభ స్వగతాలు కనిపిస్తాయి. గురజాడ కన్యాశుల్కం హాస్యరస ప్రధానమైన నాటకమని ముందే తెలిసేలా ఈ విధమైన స్వగతాన్ని కూర్చేడు. ప్రహసన ప్రాయమైన ఈ గిరీశం సంభాషణను పాశ్చాత్య నాటక పరిభాషలో Patter talk అంటారు. ప్రధానేతివృత్తానికి సంబంధం లేనట్లుగా ఈ స్వగతాలు ప్రారంభమవుతాయి. ప్రథమాంకారంభంలోనే కాకుండా మిగిలిన రంగాలు మొదలయేటప్పుడు కూడా స్వగతాలుంటాయి. షేక్స్పియరు ప్రారంభ స్వగతాలన్నీ సాధారణంగా రంగంలో రాబోయే దృశ్యాలను సిద్ధం చేసేవిగా ఉంటాయి. యుద్ధ దృశ్యాలకు మార్గాన్ని సుగమం చేయడం కోసం ఇటువంటి స్వగతాలను కల్పించడం మీద షేక్స్పియరు ఎక్కువ మక్కువ చూపినట్లు తెలుస్తొంది. గిరీశం స్వగతం ''అటు నుండి నరుక్కు రమ్మన్నాడు'' అన్య వాక్యంతో ముగుస్తుంది. ఇక్కడ నుండి నాటకంలో హాస్యం ఉత్తేజితమవడం మొదలౌతుంది. నాటకపరిభాషలో దీనిని Tag అంటారు. స్వగతాన్ని ఇలాంటి వాక్యంతో ముగించడం ఒక కళా ధర్మం. సాధారణంగా నిష్క్రమణ స్వగతాలలో (Exit soliloquy) ఇవి అత్యంతంగా రక్తికడతాయి. గురజాడ అంతవరకు ఆగలేక ప్రవేశ స్వగతంలోనే ఈ చిత్ర వాక్య నిబంధనం చేసి ప్రేక్షకులలో ఒక మధురమైన ఉత్కంఠను రగిలించేవాడు. ఇటువంటి గాఢ నాటక శిల్పాన్ని ప్రదర్శించడం కేవలం అనుకరణం అనుకోవడం గాని, లేదా కేవలం పాశ్చాత్య నాటక రీతుల ప్రభావంలో పడి కొట్టుకు పోవడంగా గాని తీసిపారెయ్యడం సహృదయ లక్షణం కాదు. ''మద్రాసు విశ్వవిద్యాలయం తన విద్యార్థులకు పరిచయం చేసే ఏకైక శిల్పమైన యెలిజిబెత్ కాలం శిల్పాన్ని గురజాడ వదలించుకోలేక పోయారు'' అని సి. ఆర్. రెడ్డి భావించడం సబబే అని నార్ల సమర్థించేరు.[9] మద్రాసు విశ్వవిద్యాలయం పాఠ్య ప్రణాళికలో నిర్దేశించిన నాటకాలతో తప్ప యితర పాశ్చాత్య నాటకాలతో గురజాడకు పరిచయం లేదన్న అభిప్రాయం కూడా సి. ఆర్. రెడ్డి మాటలలో తొంగి చూస్తుంది. అది తప్పు. తన కాలానికి అందుబాటులో ఉన్న ప్రాచ్య పాశ్చాత్య నాటక శిల్పాన్నంతటిని గురజాడ అవగాహన చేసుకున్నట్లు ఆయన గ్రంథ సంచయం తెలియజేస్తుంది.

(ఇంకావుంది)

# మూఢ నమ్మకాలు

– సి.వి. సర్వేశ్వర శర్మ

అనాగరికుడై ఆదిమ మానవునిగా జీవితాన్ని ప్రారంభించి తన అస్థికత్వాన్ని నిలుపుకుంటూ నేటి ఆధునిక యుగంలో తన ఉనికిని మరింత ప్రస్ఫుటం చేసుకుంటున్న మానవుడు సాధించిన - విజయాలు అసంఖ్యాకంగా వున్నాయి. నిత్యాన్వేషి, నిరంతర పరిశోధకుడుగా ప్రపంచాన్ని అధ్యయనం చేయడమే కాక ఈ విశ్వాంతరాళాన్ని శోధించి, భూగర్భ రహస్యాలను పసిగట్టి తన మేధా సంపత్తిని వినియోగిస్తూ మనిషి ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించగలిగాడు. ఒక విధంగా వర్ణించాలంటే ''చావును జయించడం తప్ప అన్నింటా నెగ్గగలడన్న నానుడికి చక్కని భాష్యం మనిషి చెప్పగలిగాడనిపిస్తుంది.'' మనిషి జయించలేని మరొక ప్రగతి అవరోధకము ''మూఢ నమ్మకాలు''.

ఈ నాగరిక ప్రపంచములో నిజానికి ఎన్నో అసాధ్యాలను సుసాధ్యం చేస్తున్నారు. భూమండలం అవధులు దాటి సుదూర గ్రహాలకు నక్షత్ర మండలాలకు ప్రయాణాలు కొనసాగిస్తూ అక్కడి రహస్యాలను పరికరాలను అడ్డం పెట్టుకొని వెలికి తీస్తున్న సమయంలో ఈ మూఢ నమ్మకాలు మనిషి ప్రగతిని అవహేళన చేస్తున్నాయి.

ఈ మూఢ నమ్మకాలు పల్లెల్లోను, నిరక్షరాశ్యులలోను ఎక్కువగా ఉన్నాయని చాలామంది అభిప్రాయం. నిజానికి పట్టణాలలోను అక్షరాశ్యులలోను మరీ ఎక్కువగా ఈ మూఢ నమ్మకాలు ఉండడం దురదృష్టకరమైన విషయం. పైగా తమ మూఢ నమ్మకాలను ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రచారం చేస్తూ మరికొంతమంది ప్రజలను ఈ మూఢనమ్మకాల ముసుగులోకి లాగేస్తున్నారు. కొన్ని ప్రచార సాధనాలు కూడా తెలిసో, తెలియకో మూఢ నమ్మకాలను ప్రచారం చేస్తున్నాయి. కొన్ని సినిమాలు, నవలలు, కథలు, దెయ్యాలు, భూతాలు, పిశాచాలు, పూనకాలు వంటి అంశాలకు చోటిచ్చి ప్రజలకు వాటిపై నమ్మకం ఏర్పడేటట్లు దోహదం చేస్తున్నాయి.

సరియైన శాస్త్రీయ ధోరణులు మనుషులకు అలవరచినట్లయితే మూఢ నమ్మకాలలో మనిషి మునిగిపోకుండా భయాన్ని పక్కకు నెట్టి ధైర్యంగా ముందుకు సాగుతాడు. మనిషి మస్తిష్కంలో ఉదయించే కొన్ని ప్రశ్నలు వారిలోనే నిక్షిప్తమయి పోవడం, సహజసిద్ధంగా ఉండే వారిలోని సిగ్గు, భయం, నిరక్షరాస్యత వారి ప్రశ్నలను అంతర్గతంగానే చంపివేయడం ఈ మూఢ నమ్మకాల విస్తరణకు మరొక కారణం కావచ్చు.

మనందరి జీవితాల్లోనూ మూఢ నమ్మకాలు ఒక ముఖ్య భూమికను నిర్వహిస్తున్నాయని మనకు తెలుసు. అయితే ఈ మూఢ నమ్మకం ఏరకమైనది అది నిర్వహించే పాత్ర ఏమిటో మన ఎరుకలో ఉండక పోవచ్చును. కర్మకాండ, నమ్మకాలు, ఆచారాలు వ్యక్తిగత విలువలు వంటి వేరు వేరు పేర్లతో

---

సి.వి. సర్వేశ్వర శర్మ, ప్రెసిడెంట్, కోనసీమ సైన్సు పరిషత్, అమలాపురం.

మన జీవితంలో ఈ మూఢ నమ్మకాలు చోటు చేసుకుంటున్నాయి. అతీత శక్తులున్నాయని నమ్మేవారు, అహేతుకమయిన భయాన్ని పొందేవారు, తగిన ఆధారం లేకపోయినా విషయాలను నమ్మేవారు సులువుగా మూఢనమ్మకాలకు తలవొంచుతారు.

మూఢ నమ్మకాలనేవి ఒక మతానికి, సంస్కృతికి పరిమిత మైనవి కావు. మానవ సమాజాలన్నింటిలోను ఇవి విస్తృతంగా వ్యాపించి ఉన్నాయి. మూఢ నమ్మకాలను పాటించడం అనేది మతాన్ని బట్టి, వ్యక్తిని బట్టి మారిపోతూ వుంటాయి. మత సాంస్కృతిక మూఢ నమ్మకాలు మొత్తం ఆ సమాజం పాటిస్తుంది. కాబట్టి అవి పరిశోధకునికి అందుబాటులో వుంటాయి. వ్యక్తిగత మూఢ నమ్మకాలు అధ్యయనానికి గాని, అర్థం చేసుకొనేందుకు గాని వీలుగా వుండవు.

**తుమ్మడం - మూఢ నమ్మకం:**

ప్రపంచం మొత్తం మీద వేరు వేరు ప్రాంతాలలో తుమ్మడం మీద రకరకాలైన మూఢ నమ్మకాలు ఉన్నాయి. తుమ్మడం అనేది ప్రపంచములో ఎవరికయినా, ఎక్కడైనా సంభవిస్తుంది. దీనికి శుభాశుభాలు తమాషాగా అంటగడుతూ వుంటారు. తుమ్మడం వల్ల ఆ మనిషి ఆత్మకలత చెందుతుందని నమ్మేవారున్నారు. అందుకే తుమ్మిన వ్యక్తిని 'చిరంజీవ' అని ఆశీర్వదిస్తూ కలత చెందిన ఆత్మ దాని యధా స్థానంలోకి రావలసిందిగా దీవిస్తారు.

కొంతమంది తుమ్మును, జరిగిన ప్రదేశాన్ని బట్టి, సమయాన్ని బట్టి మంచి శకునంగానో, చెడ్డ శకునంగానో పరిగణిస్తారు. ఏ రోజున తుమ్మడం జరిగిందో దానిని కూడా లెక్కలోకి తీసుకుంటారు. సోమవారం తుమ్మితే ప్రమాద సంకేతంగా తుమ్మినట్లు, మంగళవారం అయితే అగంతుకుడిని ముద్దాడతారు. బుధవారం తుమ్మితే ఉత్తరం వస్తుంది. గురువారం తుమ్మితే ఏదో మంచి జరుగుతుంది. శుక్రవారం అయితే ఏదో చెడ్డ జరుగుతుంది. శనివారం తుమ్మితే రేపటి నేస్తం కోసం, ఆదివారం తుమ్మితే క్షేమదాయకం కాదు. మొత్తం వారం అంతా దీని ప్రభావం ఉంటుంది.

వైద్య విజ్ఞానం అనుసరించి ముక్కులో ఏదైనా పరాయి వస్తువు ప్రవేశిస్తే దానిని బయటకు తొలగించేందుకు శరీర రక్షక వ్యవస్థ చర్య తుమ్ము అని మనకు తెలుసు. అయినప్పటికి పాత మూఢ నమ్మకమును మనం విశ్వసిస్తాము. ప్రశ్నించుకొనే ధోరణిని మనం అలవరచుకోలేదు.

వైద్య విజ్ఞానం ఎంత అభివృద్ధి చెందినా ప్రజలను ఈ దిశలో ఎంత విజ్ఞానవంతుల్ని చేస్తున్నా ఇంకా ప్రజల్లో కొన్ని మూఢ నమ్మకాల కారణంగా కొన్ని రోగాలను ముదరనిచ్చి ప్రాణాపాయ స్థితికి ఆ రోగులను తీసుకొని వస్తున్నారు.

**మశూచి - ఆటలమ్మ:**

ఇప్పటికీ మశూచిని పెద్దమ్మ వారని, ఆటలమ్మ, తడపర, కలరా, టైఫాయిడ్ వంటి రోగాలు తాము చేసిన పొరపాట్లకు ముత్యాలమ్మో, పోలేరమ్మో, ఆగ్రహించడం వల్ల వస్తున్నాయని

నమ్ముతున్నారు. వైద్యుని దగ్గరకు ఈ రోగులను తీసుకు వెళ్ళకుండా మేకలు, గొర్రెలు వంటి జంతువులను బలిచ్చి జాతర్లు జరుపుతామని, కొలువులు కొలుస్తామని మొక్కుతున్నారు. పైగా ఆరోగ్య కార్యకర్తలు పిల్లలకు టీకాలు వేయడానికి వెడితే వారితో సహకరించరు. ఎందుకంటే టీకాలు పిల్లలకు వేయిస్తే అమ్మవారికి కోపం వస్తుందని వారి భయం. ఇది వారి అజ్ఞానానికి నిదర్శనం.

పాప కర్మల ఫలితంగా క్షయవంటి వ్యాధులు వస్తాయని, ఆ రోగాలు నయం కావాలని తమ శక్తినంతా పూజలు, పునస్కారాలు చేయడానికి వినియోగిస్తారు. వైద్య సహాయం కోసం ప్రయత్నించని వారు ఇంకా చాలామంది ఉండడం మనకు ఎంతో ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది. ఇటువంటి అంటువ్యాధులు సూక్ష్మజీవులు, వైరస్ వంటి వాటివల్ల వస్తాయి. దగ్గడం, తుమ్మడం వంటి రోగి చేష్టలవల్ల చుట్టు పక్కల వారికి సోకుతాయి.

హిస్టీరియా, ఫిట్సు, చలిజ్వరం వంటి రోగాలతో రోగి వణుకుతూ వుంటే రోగికి దయ్యం పట్టిందని, భూతవైద్యుడిని పిలిపించి వారి మెడలో మంత్రపుతాళ్ళు వేయించి, చీపురు కట్టతో రోగిని రకరకాలుగా హింసకు గురి చేస్తూ వుంటారు.

**పొట్టలమీద వాతలు:**

చిన్న పిల్లలకు ఆహారం సులువుగా జీర్ణమవుతుందని కొంతమంది వారి పొట్టలమీద సూదులతో కాలుస్తారు. సూదుల వల్ల గాయాలు ఏర్పడి చీముపట్టి ఆ పిల్లల్ని కొంతకాలం బాధిస్తాయి తప్ప జీర్ణశక్తిని ఏ మాత్రం పెంచవు.

పొగాకు చుట్ట తాగితే ఆస్మా తగ్గుతుందని అనే మూఢ నమ్మకం చాలామందిలో కనిపిస్తుంది. ఈ చుట్ట పొగ తాగడం వల్ల ఉబ్బసం తగ్గడం మాట అటుంచి మరింత అధికమవుతుంది. ఎటువంటి పొగైనా ఊపిరితిత్తులలోకి వెడితే ప్రమాదకరం.

తమ ఆరాధ్యదైవాలను వింత వింత రీతుల్లో పూజించి తన్మయత్వంలో అనిర్వచనీయమైన ఆనందాన్ని పొందే భక్తులను కూడా మనం చూస్తూ వుంటాము. వింటూ వుంటాము. ఇతరులకు ఇబ్బంది లేకుండా తమ తమ మత పర లక్ష్యాలను సాధించుకోవాలని అన్ని మతాలు చాటి చెపుతున్నాయి. కానీ విభిన్న మతాలు, పలు భాషలు గల నేటి సమాజంలోని భక్తులు ముక్తి కోసం అనుసరిస్తున్న కొన్ని మార్గాలు ఎంతో ఆందోళన కలిగిస్తున్నాయి.

**నగ్న పూజలు:**

నగ్న పూజలు, చిత్రమైన ప్రదర్శనలు, కానుకల సమర్పణ, క్షుద్ర దేవతారాధన వెర్రితలలు వేసి కొత్త కొత్త సమస్యలు అటు ప్రభుత్వానికి, ఇటు ప్రజలకు తెచ్చి పెడుతున్నాయి. ఉదాహరణకు కర్ణాటకలో షిమోగా జిల్లాలోని చంద్రగుత్తికి చెందిన రేణుకాదేవి అనే ఆమెను అచటి ప్రజలు దేవతగా కొలుస్తారు. ప్రతి సంవత్సరం ఆమె ఉత్సవాలు చేస్తారు. ఆ ఉత్సవంలో ఆమెను భక్తులు

నగ్నంగా ఆరాధిస్తారు. ఈ దుష్ట సాంప్రదాయాన్ని నిరోధించడానికి ప్రభుత్వం, స్వచ్ఛంధ సంస్థలు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించలేదు.

ఆ ప్రాంతానికి తరలివెళ్ళే భక్తుల దృక్పథంలో మార్పు తీసుకు రావాలని ప్రయత్నించిన ప్రభుత్వ సిబ్బందిని, సాంఘిక కార్యకర్తలను తమ పూజా కార్యక్రమాలకు అంతరాయం కల్గిస్తున్నందుకు విచక్షణా రహితంగా భక్తులు కొట్టారు. అంతే కాదు భక్తులు ఒక ఉన్నతాధికారిని, మరికొందరు పోలీసుల్ని బలవంతంగా నగ్నంగా తయారు చేసి తమ పూజా విధానంలోకి దించారు. 1987లో ఈ పూజా కార్యక్రమాలు నిరోధించడంలో ప్రభుత్వం, ఇతర స్వచ్ఛంధ సంస్థలు విజయం సాధించాయి. ఇపుడు కర్ణాటక ప్రభుత్వం నగ్న పూజలు నిషేధించింది.

**మూఢభక్తి :**

కర్నాటకలోని గుల్బర్గాలో ఒక భక్తుడు తన చర్మంతో పాదరక్షలు కుట్టించి సంగమేశ్వరుడికి 1988 జనవరిలో కానుకగా సమర్పించిన సంఘటన దేశ వ్యాప్తంగా ఎంతో సంచలనాన్ని కల్గించింది. అంతేకాదు కొన్ని ప్రాంతాలలో జరిగిన సతీసహగమనం, జంతు, నర బలులు వంటి ఘాతుకాలు దేశ ప్రజలకు ఎంతో భయాందోళనలు కల్గించాయి.

ఒకసారి మూఢ నమ్మకం మనుష్యుల్లో స్థిరపడిందంటే దాని నుండి వారిని బయటకు తీసుకురావడం కష్టమవుతుంది. పైగా అది బహువ్యాప్తి చెందుతుంది. సైన్సు చైతన్యవంతమైనది. ప్రకృతికి సంబంధించిన నూతన విజ్ఞానం కోసం కొత్త పరిజ్ఞానం కోసం నవీన సూత్రాల కోసం నిరంతర పరిశోధన జరుగుతూ వుంటుంది. వీటిని కలపడం వల్ల విజ్ఞానపు ఖచ్చితత్వం, సొగసు మరింత అధికమవుతుంది.

సమాజ ఉద్భవంతో సాంఘిక సందర్భాలు, విషయాలు ప్రత్యక్షంగాను, అప్రత్యక్షంగాను మారుతూ వుంటాయి. ఈ మార్పు సమాజానికి చేరిన కొత్త విజ్ఞానం మీద ఆధారపడి వుంటుంది. శాస్త్ర సాంకేతిక విజ్ఞానం రకరకాల సాంఘిక ప్రక్రియల ద్వారా సమాజానికి చేరాలి.

శాస్త్రవేత్తలు సమాజానికి రెండు రకాలుగా సహాయ పడవలసి వుంటుంది. బాగా పాతుకుపోయిన మూఢ నమ్మకాలను, శాస్త్ర పరిశోధనతో పరీక్షించాలి. వారు తెలుసుకున్న నిజాలను ప్రజల్లోకి బాగా వ్యాప్తి చెందించాలి. శాస్త్ర పరిశోధనలో కార్యాకారణ సంబంధం నిష్పాక్షిక నిర్ణయాలు ఉంటాయి. కాబట్టి ప్రజలకు వారి మూఢ నమ్మకాలలోని లోటు పాట్లను చక్కగా వివరించి చెప్పాలి. ప్రజలు తమ నమ్మికలోని లోపాలను తప్పును గ్రహించాల్సిన విధంగా వారిని విద్యావంతులను చేయాలి.

శాస్త్రవేత్త చెప్పదలచుకొన్న పరిశోధన విషయాలను ప్రజల భాషలో ప్రజలకు అర్థమయ్యేటట్లు చెప్పాలి. సైన్సు విజ్ఞానాన్ని జన విజ్ఞానంగా చెప్పడం ఎంతైనా అవసరం.

## సాహిత్య ఆకాశంలో

# ఉరుములు - మెరుపులు

- ముప్పాల సుబ్బరామయ్య

పూర్వం పండిత ప్రకాండుల సాము గరిడీలకు సాహిత్య పత్రికలు తాలింఖానాలయినాయి. పరస్పర దూషణ సాహిత్య విమర్శగా చెలామణి కాసాగింది. నెల్లూరు మండలంలో తొలి తెలుగు పత్రిక పూండ్ల రామకృష్ణయ్య గారి 'అముద్రిత గ్రంథ చింతామణి'. రామకృష్ణయ్యగారు ఒకవైపు పత్రికను నడుపుతూ, మరొకవైపు తాళపత్రాలను పరిష్కరించి పుస్తక ప్రచురణ చేస్తూ వచ్చారు. మిత్రావింద పరిణయము, హరిశ్చంద్ర నలోపాఖ్యానము, వసుంధరా పరిణయము, యాదవ రాఘవ పాండవీయము మొదలైన ప్రాచీన గ్రంథాలను పరిష్కరించి, చక్కని పీఠికలు చేర్చి అచ్చువేశారు. ఈ విధంగా అముద్రిత గ్రంథాలను ముద్రించడమనే తమ పత్రిక ప్రధానాశయాన్ని సార్థకం చేసుకున్నారు. రామకృష్ణయ్య గారికి చాటు పద్యాల సేకరణపై మంచి ఆసక్తి. వందకు పైగా చాటు పద్యాలు సేకరించి అముద్రిత గ్రంథ చింతామణిలో ప్రచురించారు. వాటిలో కొన్ని వేటూరి ప్రభాకర శాస్త్రిగారి సంకలనంలో, కొన్ని దీపాల వారి సంకలనంలో చోటు చేసుకున్నాయి. కాని పూండ్ల వారిని మాత్రం చాటు పద్య సంకలన కర్తగా ఎవరూ స్మరించలేదు. అముద్రిత గ్రంథ చింతామణి పత్రిక పేజీలలో మండపాక పార్వతీశ్వర కవి పద్యమాలికలు నాలుగోవంతు వుండేవంటే అతిశయోక్తి కాదు. పార్వతీశ్వర కవికి, పూండ్ల వారికి తటవర్గ బిందు పూర్వక యతి విషయంలో అభిప్రాయ భేదం వచ్చి వారి మిత్రత్వానికి భంగం కలిగింది. కొక్కొండ వెంకటరత్నం పంతులుగారి 'బిల్వేశ్వరీయాన్ని' రామకృష్ణయ్యగారు ఎంతో సహృదయంతో సమీక్షించినా, ముందుగానే తమకు కలిగిన సందేహాలను కొక్కొండవారి సముఖంలో వినిపించగా, ఏ సమాధానమూ చెప్పక, పరుషంగా 'సంజీవని' పత్రికలో కొక్కొండవారు సమాధానం చెప్పడంతో అది పెద్ద యుద్ధంగా మారింది.

వేంకట రామకృష్ణ కవులు ( జంటకవులు) ఓలేటి వేంకటరామశాస్త్రి, వారి మేనత్త కొడుకు వేదుల రామకృష్ణ. వీరిద్దరూ పిఠాపురం మహారాజా రావు సూర్యారావు గారి ఆస్థాన కవులుగా వుండేవారు. ఈ కవిద్వయం, తిరుపతి వేంకటకవులనే (చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి, తిరుపతి శాస్త్రి) జంటకవులతో హోరాహోరి కవిత్వ యుద్ధం చేశారు. దాంతో కొంత సాహిత్యం వెలువడింది. తిరుపతి వేంకట కవులు పాశుపతము, గీరతము, బిడాలోపాఖ్యానం అనే గ్రంథాలను; వేంకట రామకృష్ణ కవులు కోకిలాకాకము, శృంగభంగము, శతఘ్ని అనువానిని వెలువరించారు. తిరుపతి వేంకట కవులు పాండవాశ్వమేధ నాటకం ప్రచురిస్తే, వేంకట రామకృష్ణ కవులు దానిలో నూరు తప్పులను చూపిస్తూ శతఘ్ని అనే పుస్తకాన్ని ప్రచురించారు. దాంతో యుద్ధం ముమ్మరమైంది. తిరుపతి వేంకట కవులు పాశుపతం అనే సమాధానాన్ని ప్రయోగించారు. అలాగే ఖండన ముండనములు, మండన ముండనములు బయలు దేరాయి. ఈ సాహిత్య సమరాన్ని పాఠకులు ఆనందించారు. అయితే ఈ యుద్ధంలో ఎవ్వరూ ఓడనూ లేదు, గెలవనూ లేదు.

---

ముప్పాల సుబ్బరామయ్య, జయంతి పబ్లికేషన్ ద్వారా సాహిత్య సేవ చేస్తున్నారు, విజయవాడ.

తిరుపతి వేంకట కవులు శ్రవణానంద, పాణి గ్రహీత రచనలు చేయగా, వాటిని చదివి శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు 'పాణి గ్రహీతా శ్రవణానంద శృంఖల' అనే విమర్శ వ్రాసి ప్రకటించారు. అప్పుడు వారి గురువులు వేంకట రామకృష్ణ కవులు వ్రాత ప్రతి అయినా చూపించక పోయావే అని కోప్పడ్డారు శ్రీపాదవారిని. వేంకట రామకృష్ణ కవులే రాసి, శిష్యుడి పేరు పెట్టారని సాహితీ లోకంలో ప్రచారమైంది. చెళ్ళ పిళ్ళ వేంకట శాస్త్రి గారు శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రగారి మీద 'శృంఖలా తృణీకరణం' అనే విమర్శ వదిలారు. శ్రీపాద వారు దాని మీద ఖండన రాయడానికి పూనుకుని 'గళహస్తిక' రచించారు. గురువులిద్దరికీ చూపించారు. రామకృష్ణ శాస్త్రిగారు పూర్తిగా చదివి నిలువుగా రెండు చీలికలు చేశారు. 'భేష్ మంచి పని చేశా' వని వేంకట రామశాస్త్రి గారు. ''తిరుపతి వేంకట కవులు వయసులో మనకంటే చాలా పెద్దలు. మీరింకా చాలా రచించవలసి వుంది. మీకూ వారికీ కూడా ఇప్పుడిదీ హద్దు. మాది కలహం. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే సంకుల సమరం. సత్వానికీ భుక్తానికీ సంబంధించిందది. అక్రమణకూ ప్రతిఘటనకూ సన్నాహం ఇక్కడ. ఒక విధంగా మాకూ మాకూ జీవన్మరణ సమస్య ఇది. విమర్శతో ప్రారంభం కాలేదిది. విమర్శతో ఆగదు. విమర్శ ఇక్కడ ఒక ఆయుధం. అంతే. మీ సంగతి యిలాంటిది కాదు'' అని నచ్చ చెప్పారు శ్రీపాద వారికి.

కాకినాడలో శ్రీపాదవారికి తిరుపతి శాస్త్రిగారు తటస్థపడి, ఫలానా అని తెలుసుకుని ''అయితే మా శత్రుకోటి వారన్న మాట. కాదు, కాదు. మా పొరపాట్లు చూపించిన వారు మిత్రకోటి వారవుతారు గాని, శత్రుకోటి వారెలా అవుతారని'' హుందాగా అన్నారు తిరుపతి శాస్త్రిగారు. కాని రాజమండ్రిలో ఎదురైన చెళ్ళపిళ్ళ వారు మాత్రం నోరు చేసుకున్నారట. శ్రీపాదవారి మాటల్లో -

''మీరేనా శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారంటే?'' అంటూ ఎర్రశాలువా భుజాన వేసుకున్న వారెవరో వస్తున్నారు నాకేసి. ''నేను చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రిని లెండి'' అంటూ దగ్గరకే వచ్చారు వారింతలో. 'నమస్కారం అన్నాన్నేను. ఆశీర్వదించలేదు సరిగదా, తిట్లకు లంకించుకున్నారు వేంకట శాస్త్రిగారు. తెల్లపోయా నేను. ఇంతలో చాలామంది చేరారక్కడ. అటూ ఇటూ రోడ్డే వెళ్ళే వారున్నూ ఆగిపోయారు. అలా తిడుతూనే వున్నారు వేంకట శాస్త్రిగారు. మరో మాట లేదు. ఇక లాభం లేదని నేనూ ప్రారంభించాను, తిట్టుకు తిట్టు. 'నా పుస్తకాలు విమర్శిస్తావా?' అని వారి దబాయింపు. ''ఆకాశం నుంచి వూడి పడ్డాయా నీ పుస్తకాలు, మహా?'' అంటూ నా బుకాయింపు. ''సభ చేస్తాను వస్తావా?'' అనడిగారాయన. ''మగతనం వుంటే చెయ్యవలసిన పని అదీ. ఈ తిట్లేమిటి క్షుద్రజాతి మనిషిలాగ?'' అని బదులిడిగాన్నేను.

''ఊరుకోం డూరుకోం'' డంటూనే వున్నారు చేరిన వారు ఇద్దర్నీ. ''ఇదేమిటో చూశావా?'' అంటూ కాలెత్తి చూపించారు వెంకట శాస్త్రిగారు. ఎడమకాలి చెప్పులాగే మాట్లాడాన్నేను ''సరదాగా వుంటేరా'' అంటూ, అప్పటిదాకా చూస్తూ వింటూ వద్దు వద్దంటున్న వారల్లా అక్కడ మూగి వుండిన వారిలో కొందరాయన్నటూ, మరికొందరు నన్నిటూ లాగేశారు ''తప్పు తప్పంటూ''. అని అనుభవాలు జ్ఞాపకాల్లో వివరించారు శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారు.

పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రిగారు 1923లో మహాభారత చరిత్ర ప్రథమ భాగం అనే విపుల పరిశోధన, విమర్శనాత్మక గ్రంథమును వ్రాసి ప్రకటించారు. అది 1933లో ద్వితీయ ముద్రణ పొందింది. దీని మీద వ్యతిరేక అభిప్రాయాలు, అనుకూల అభిప్రయాలు చాలా బయలు దేరాయి. వ్యతిరేకించిన వారిలో ముఖ్యులు శ్రీపాద కృష్ణ మూర్తి శాస్త్రి (రాజమండ్రి) గారు, శ్రీ వారణాసి సుబ్రహ్మణ్య శాస్త్రి (పిఠాపురం) గారు. వారణాసి సుబ్రహ్మణ్య శాస్త్రిగారు మహా భారత తత్త్వ కథనము, పాండవ నిందా నిరాకరణము అనే నాలుగు సంపుటాల పెద్ద విమర్శ గ్రంథాన్ని ప్రకటించారు. శ్రీపాద కృష్ణ మూర్తి శాస్త్రిగారు, పెండ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రిగారు పత్రికలలో ఒకరి మీద ఒకరు ధూషణ వాక్యాలతో వ్యాసాలు వ్రాసి, చివరకు కోర్టుకెక్కారు. దీనిని విచారించి రాజమండ్రి స్పెషల్ ఫస్ట్‌క్లాస్ మాజిస్ట్రేట్ దావులూరి ఉమామహేశ్వర రావుగారు చెరి ఒక ఇరవై రూపాయలు జరిమానా విధించారు. పెండ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రిగారి మహాభారత విమర్శను ఆమోదించినవారిలో ముఖ్యులు సర్వేపల్లి రాధాకృష్ణ, కట్టమంచి రామలింగారెడ్డి, పండిత సీతానాథ తత్త్వ భూషణ, వి.ఎస్. సుక్తంకర్, ఎ.వి. నరసింహం పంతులు, తల్లావఝ్ఝల శివశంకర శాస్త్రి, డ్యాక్టర్ ఎ.బి. కీత్.

ఆకొండి వ్యాసమూర్తి శాస్త్రిగారు సంస్కృత మహాభారతాన్ని చాలా వరకు తెలుగు చేశారు. కల్లూరి వేంకట శాస్త్రిగారి యొక్క లోపలి నిప్పును గమనించక ఆకొండివారు ముట్టుకొని, అంతటితో సర్దుకున్నారు కాబట్టి సరిపోయింది. లేకపోతే వ్యంగ్యరచన కొండ చరియాలా విరుచుకు పడేది.

అపరకేళికుడైన శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు, అపర వసిష్టుడైన కల్లూరి వెంకట రామశాస్త్రిగారి దగ్గర శిష్యరికం చేసిన మాటను మరిచి, గురువుగారిని ఇంటి పేరుతో సహా హేళనకు దిగారు. అపర వశిష్టుడు, అన్యాపదేశ (సెటైర్) కామధేనువును విడిచి పెట్టారు. నేల ఈనినట్లుగా బయలు దేరిని సైన్యాన్ని తట్టుకోవడం ఎవరితరం! ఇది రామశాస్త్రిగారికి వినోద లీల. కల్లూరి వారి అన్యాప దేశానికి తిరిగి సమాధానం చెప్పలేక గురువులముందు తలవంచారు శ్రీపాదవారు. కల్లూరి వారు ఈ అన్యాపదేశ రచనకు 'హాస్యకుముదారకం' అని చక్కని పేరుపెట్టుకున్నారు. దీనికి సాటి అన్యాపదేశ (సెటైర్) గ్రంథము నీతివంతమైనది తెలుగులో లేదు. హాస్యకుముదారకాన్ని చదివిన వారు వీరిద్దరి జగడం చీటి భారతంలా పెరగక పోయిందేమా! అని విచారిస్తారు.

కందుకూరి వీరేశలింగం గారి రచన 'మహారాణ్య పురాధిపత్యము' ఆక్షేప గర్భ నాటకము. పంచ తంత్రములోని కథ దీనికి మూలాధారము. సంఘములోని వివిధ దురాచారాలను రూపు మాపించాలనే ముఖ్యోద్దేశంతో వీరేశలింగంగారు వినోదకరంగా రచించారు. కాని ఇది తమని ఉద్దేశించి వ్రాశారని ఏలూరి లక్ష్మీనరసింహంగారు ఆయనపై అభియోగం తెచ్చారు.

వీరేశలింగం గారు వివిధ సందర్భాలలో ధర్మార్థ, నీతి, సత్యం, అహింస, ఆత్మ మొదలైన వివిధ విషయాలపై వ్రాసిన వ్యాసాలను సంకలనం చేసి 'ఉపన్యాస మంజరి' అనే పుస్తకాన్ని ప్రచురించారు. ఈ పుస్తకాన్ని కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రిగారు, 'ఉపన్యాస మంజరీ విమర్శనం' అనే పేరుతో దుయ్యబట్టారు. సాంఘిక దురాచారాలను, మూఢ విశ్వాసాలను తూర్పారపట్టే 'రాజశేఖర చరిత్ర' (గోల్డ్ స్మిత్ - వికార ఆఫ్ వేక్‌ఫీల్డ్)ను వీరేశలింగం గారు రచిస్తే, 1896లో 'వివేక చంద్రికా విమర్శనం' అనే పేరుతో ఏడు వ్యాసాలలో బ్రహ్మయ్య శాస్త్రి గారు విమర్శించారు.

శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు 'లొడారి బుచ్చిగాడు' అని వ్రాసిన ప్రహసనం చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి మీద అని చెప్పుకుంటారు. వేదం వెంకట రాయ శాస్త్రిగారు కొక్కొండ వెంకటరత్నం పంతులుగారితో ఎంత హోరాహోరీ పోరు సలిపారో, అలాగే వ్యవహారిక వాదులపైన కూడా విరుచుకు పడ్డారు.

ఒకసారి సురవరం ప్రతాపరెడ్డి గారు 'జంగములు బ్రాహ్మణులు కారు' అనే వ్యాసాన్ని వ్రాసి 'గోలకొండ' పత్రికను శిఖరానికెక్కించారు. దానిని చదివిన చిదిరె మఠం వీరభద్రశర్మగారి అరికాలి మంట నెత్తికెక్కింది. వాదోపవాదములు, ఖండన ముండనములు, తర్జన భర్జనలు చెలరేగినవి. రచన చేయగల దిగ్గంతు లంతా తమ సునిశిత భావ శరపరం పరలచే ప్రతికక్షుల వాదాంశాలను పూర్వ పక్షం చేయడానికి కృత నిశ్చయులై రంగంలోకి దూకారు. అవి వాదోపవాద రూపంలో వికసించిన రస ఝురులు, వక్రోక్తులు, వ్యంగ్యాలు, ధ్వనులు, ధ్వనాభ్యాసాలు ఎన్నో ఛలోక్తులతో నిండిన ఆ వ్యాస పరం పరలు చదివి పాఠకుల హృదయాలు తన్మయత్వంలో తేలాయంటే అతిశయోక్తి కాదు. అలా వారాల తరబడి సాగిన వారి వాదోపవాదముల ఫలితంగా జంగములకు బ్రాహ్మణ శ్రేణి దొరికిందో లేదో కాని 'గోలకొండ' ప్రాచుర్యం పెరిగింది.

కోపల్లె హనుమంతరావుగారు బందరులోని జాతీయ కళాశాల వ్యవస్థాపకులు. పట్టాభి సీతారామయ్య, ముట్నూరి కృష్ణారావు గార్లు సహచరులు. దుగ్గిరాల గోపాల కృష్ణయ్యగారు ఆ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా వుండేవారు. కార్య వర్గంలోని కోపల్లె, పట్టాభి, ముట్నూరి వారితో దుగ్గిరాల వారికి అభిప్రాయ భేదాలు కలిగాయి. దాంతో గోపాలకృష్ణయ్యగారు పదవికి రాజీనామా చేసి వెళ్ళిపోయారు. ఆ తరువాత సత్యాగ్రహోద్యమము సమయంలో 'బోగస్ పేట్రియాట్' (Bogus Patriot) అనే ఇంగ్లీషు పుస్తకం ప్రచురణ అయింది. అది గోపాల కృష్ణగారే పట్టాభిగారిపై వ్రాసి, ప్రచురించారని అంటారు.

1920లో మహానంది క్షేత్రంలో ఆంధ్ర మహాసభ జరిగిన సందర్భంలో బందరు నుండి ఆ సభకు వచ్చిన పెద్దలు కొందరు దుగ్గిరాల గోపాల కృష్ణయ్యను 'సుంకర కొండడు' అని హేళన చేయగా - ఆయన.

క॥ బింకాలు పలుకు బందరు
కుంకల ఫీంకారమెల్ల గీడ్వడసేయన్
శంకరుడే మహానందిని
సుంకర కొండయ యాయె జోద్యం బేలా? - అని సమాధానమిచ్చారు.

ఇక బహుమతుల విషయంలో

ఆంధ్ర, భీష్మ న్యాపతి సుబ్బారావు పంతులుగారు అనేక విధాలైన మంచి పనులు చేశారు. 1891లో 'చితామణి' అనే మాస పత్రికను నెలకొల్పారు. దీనికి సంపాదకులు కందుకూరి వీరేశలింగం పంతులుగారు. 1893లో సుబ్బారావు గారు నవలల పోటీ నిర్వహించగా, మూడు నవలలు వచ్చాయి. ఖండవల్లి రామ చంద్రుడు గారి 'ధర్మ పత్నీ విలాసం' కు రు. 75/-ల ప్రథమ బహుమతి, తల్లా ప్రగడ

సూర్యనారాయణరావుగారి 'సంజీవరాయ చరిత్ర' కు రు. 50/- ల ద్వితీయ బహుమతి లభించింది. 1894లో మొదటి బహుమతి రు. 125/- లు, రెండవ బహుమతి రు. 75/- లుగా ప్రకటించగా, పోటీకి పద్నాలుగు నవలలు వచ్చాయి. చిలకమర్తి లక్ష్మీ నరసింహం గారి 'రామచంద్ర విజయము' నకు మొదటి, గోటేటి కనకరాజుగారి 'వివేక విజయం' కు రెండవ బహుమతి నిర్ణయించారు. వావిలాల వాసుదేవ శాస్త్రి గారు, కందుకూరి వీరేశలింగం గారు, ఆచంట సుందరరామయ్య (జిల్లాకోర్టు న్యాయవాది)గారు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. పరిశీలకులలో అభిప్రాయ భేదం రాగా బహుమతి మొత్తాన్ని కలిపి చెరిసగంగా పంచారట!

'నారాయణ రావు' - 'వేయిపడగలు' నవలలు బహుమతి నిర్ణయాన్ని గురించి ఆనాటి పత్రికలలో చాలా విమర్శలు చెలరేగాయి. పింగళి లక్ష్మీ కాంతం గారు విమర్శలకు గురియైనారు. కాని జరిగిందేమంటే - ఆంధ్ర విశ్వకళా పరిషత్తు సభ్యులందరూ అడివి బాపిరాజు గారి 'నారాయణరావు' నవలకే బహుమతి ఇమ్మని సిఫారసు చేశారు. ఒక్క జయ పురం మహారాజా శ్రీ విక్రమ దేవ వర్మ గారు మాత్రం విశ్వనాథ సత్యనారాయణ గారి 'వేయి పడగలు' కు ఇమ్మని సిఫారసు చేశారు - దీనిలో ప్రాచీన ధర్మములు, సాంప్రదాయములు వివరింపబడి వున్నాయి. దీనికే బహుతి ఇమ్మని నేను సిఫారసు చేస్తున్నాను అన్నారు. మిగతా సభ్యులంతా 'నారాయణరావు' నవలలో కూడా ప్రాచీన సాంప్రదాయాలున్నాయి. నవలకు ఉండవలసిన ముఖ్య లక్షణములు నారాయణ రావులో మూర్తీభవించి ఉన్నాయి అంటూ వారందరూ ఏకాభిప్రాయులై నారాయణ రావుకు బహుమతి ఇవ్వాలని సిఫారసు చేశారు. అప్పుడు విక్రమ దేవ వర్మగారు రెంటికి చెరిసగం ఇమ్మని తుది పరిష్కారం చేశారట.

ఓ సందర్భంలో దాశరథి కృష్ణమాచార్య ''కె. వి. రమణారెడ్డి, శ్రీశ్రీని ఎంతగా పొగిడారో, ఆరుద్రని అంతగా తెగిడారు. ఇది అనారోగ్యకరమైన విమర్శనా రీతిగా నేను భావిస్తున్నాను. ఉభయులు ఆధునిక కవితా ప్రవాహంలో విప్లవరీతులను ప్రవేశ పెట్టిన కవులు, రమణా రెడ్డిగారు 'అక్షర తూణీరం' కేవలం ఆరుద్రగారిపై అక్కసు వెళ్ళ బోసుకోవడానికి వ్రాసినదే అంటాను. శ్రీశ్రీ పురోగామి అనడాన్ని నేను ఎంత మెచ్చుకుంటానో, ఆరుద్ర తిరోగామి అనడాన్ని నేను అంతగా నొచ్చుకుంటాను'' అన్నారు.

ఇదీవరస ! ఇలా సాహిత్య రగడలు చెప్పుకుంటూ పోతే చేట భారతమే ! ముట్నూరి కృష్ణారావు గారికి మద్దుకూరి చంద్రశేఖర రావు గారికి - విశ్వనాథ సత్యనారాయణ గారికి నార్ల వేంకటేశ్వర రావు గారికి - నార్ల వెంకటేశ్వర రావు గారికి రాంభట్ల కృష్ణమూర్తి గారికి - శ్రీశ్రీకి దాశరథికి - శ్రీశ్రీకి ఆరుద్రకి - రంగనాయకమ్మకి శ్రీశ్రీకి - రంగనాయకమ్మకు డా॥ నిమ్మగడ్డ వెంకటేశ్వర రావుకి - రంగనాయకమ్మకి తెన్నేటి హేమలతకు - రంగనాయకమ్మకు ఓల్గాకు - రంగనాయకమ్మకి సి. వి. కి (సి. వరహాల రావు) - యండమూరి వీరేంద్రనాథ్‌కి సూర్య దేవర రామ మోహనరావుకి - ఇలా ఎన్నో ఎన్నెన్నో !!

"Published with Financial Assistance from the Central Institute of Indian Languages, (Ministry of Human Resource Development, Dept. of Secondary and Higher Education, Govt. of India) Manasagangotri, Mysore - 570 006 vide sanction Letter No. F. 53-1/2001-2002/LM/GRNT dated 19th March, 2002 under the scheme of Grant-in-Aid L.M."



Sue, The 65-million-year-old skeleton of the largest Tyrannosaurus rex ever found, went on display at Field Musuem in Chicago

MISIMI/మిసిమి RNI Regd. No. 45042/90 Telugu Monthly, Hyderabad-500 020. Postal Regd. No. H/SD/191




తల్లి బిడ్డ

చిత్రకారుడు : రమావత్ శ్రీనివాస్ నాయక్